RNI APTEL/25/A0798

# టుడే విదుర

జాతీయ తెలుగు దిన పత్రిక

https://www.todayvidhura.com/

ప్రచురణ: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సంపుటి : 1 సంచిక:46 6-8-2025 బుధవారం ఎడిటర్ :మర్రి పవీణ్ పేజీలు : 8 వెల 4 /-

## త్వరలోనే జమ్మూకశ్మీర్ కు రాష్ట్ర హోదా..?



### కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు..!

### రాష్ట్రపతితో మోడీ, అమిత్ షాల భేటీ నేపథ్యంలో ఊహాగానాలు

వెబ్ డెస్క్,ఆగస్టు 05(టుడే విదుర) : రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తో ప్రధాని నరేంద్ర మోడీ , కేంద్ర హోంమంత్రి అమిత్ షా లు వరుసగా భేటీ అయ్యారు. ఇద్దరు నేతలు ముర్ముతో ఎందుకు భేటీ అయ్యారనే విషయంపై స్పష్టమైన సమాచారం లేదు. అయితే కేంద్రపాలిత ప్రాంతమైన జమ్మూ కశ్మీర్ కు రాష్ట్ర హోదా పునరుద్ధరణ విషయంపై చర్చించేందుకే సమావేశమైనట్టు ఊహాగానాలు వెలువడుతున్నాయి.ముర్ముతో భేటీ అనంతరం అమిత్ షా కొందరు జమ్మూ కశ్మీర్ నాయకులతోనూ భేటీ అయినట్టు సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. ఆగస్టు 5న ఆర్టికల్ 370 రద్దు చేసి ఆరేళ్లు పూర్తవుతుంది. దీనికి కొద్ది రోజుల ముందే ఈ సమావేశాలు జరగడం పుకార్లకు మరింత బలం చేకూర్చింది.

నేడు ఎన్డీఏ ఎంపీలతో మోడీ భేటీ..!

ఇదే విషయంపై ప్రధాని మోడీ ఎన్డీఏ ఎంపీలతోనూ కీలక సమావేశాన్ని కూడా ఏర్పాటు చేయనున్నట్టు సన్నిహిత వర్గాలు తెలిపాయి. ఈ సమావేశంలో జమ్మూ కశ్మీర్ అంశంపైనే చర్చించనున్నట్టు పేర్కొన్నాయి. కశ్మీర్ కు రాష్ట్ర హోదా కల్పించడానికి ప్రభుత్వం ఏదైనా చట్టం తీసుకురాబోతోందా అనే అంచనాలు వెలువడుతున్నాయి. కాగా, 2019 ఆగస్టు 5న కేంద్ర ప్రభుత్వం ఆర్టికల్ 370ని రద్దు చేసింది. అనంతరం జమ్మూ కశ్మీర్, లఢఖ్ లను కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించింది. అనంతరం పదేళ్ల తర్వాత కశ్మీర్ లో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఆ నేపథ్యంలో కశ్మీర్ కు రాష్ట్ర హోదా కల్పిస్తామని మోడీ హామీ ఇచ్చారు. ఈ క్రమంలోనే దీనిపై చర్చలు జరపనున్నట్టు తెలుస్తోంది.

## ఏపీ ప్రజలకు బంగారంలాంటి వార్త..



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో సంచలన నిర్ణయం తీసుకుంది. రాజధాని అమరావతి నిర్మాణంలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ మేరకు రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ ప్రత్యేక వెబ్‌సైట్ సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చింది. వెబ్‌సైట్‌లో “డొనేట్ ఫర్ అమరావతి” అనే కొత్త ఆప్షన్‌ను తీసుకొచ్చింది. దీని ద్వారా ప్రజలు నేరుగా విరాళాలు అందజేసే వీలును కల్పించింది.

వెబ్‌సైట్‌లో క్యూఆర్ కోడ్ ద్వారా విరాళాల ప్రాసెస్

వెబ్‌సైట్‌లో ఇచ్చిన ఆప్షన్‌పై క్లిక్ చేస్తే యూపీఐ ఆధారిత క్యూఆర్ కోడ్ కనిపిస్తుంది. దాన్ని స్కాన్ చేసి పేమెంట్ గేట్‌వే ద్వారా ప్రజలు తమకు వీలైన మేర విరాళాన్ని అందజేయవచ్చు. మొత్తం లావాదేవీ పూర్తిగా డిజిటల్‌గా, పారదర్శకంగా సాగనుంది. ఈ ప్రక్రియలో చెల్లించిన మొత్తం నేరుగా సీఆర్డీఏ ఖాతాలోకి జమవుతుంది.

‘మై బ్రిక్ మై అమరావతి’ గుర్తుందా..?

అమరావతి నిర్మాణానికి ప్రజల భాగస్వామ్యాన్ని పెంచే ప్రయత్నంలో ఇదే తొలి అడుగు కాదు. 2015 అక్టోబరులో అప్పటి, ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేపట్టిన “మై బ్రిక్ మై అమరావతి” కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఒక్కో ఇటుక రూ.10 చొప్పున ప్రజలు కొనుగోలు చేసి తమ మద్దతు తెలిపిన సందర్భం గుర్తుండే ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రవాసాంధ్రులు పెద్ద ఎత్తున విరాళాలు అందించారు. కొందరు ఒక్కొక్కరు 10 వేల ఇటుకల విలువైన విరాళాలు అందించారు. దాతలకు ముఖ్యమంత్రి సంతకం చేసిన రసీదు జారీ చేశారు.

ప్రజల మద్దతుతో రాజధాని అభివృద్ధి

తాజాగా ఏర్పాటు చేసిన డిజిటల్ విరాళాల వ్యవస్థ ద్వారా.. ప్రజల మద్దతుతో అమరావతిని అభివృద్ధి చేయాలన్న సంకల్పానికి మరింత బలం చేకూరనుంది. అన్ని వర్గాల మద్దతు లభిస్తుందన్న ఆశాభావంతో ప్రభుత్వం ముందుకు వెళ్తోంది

## నాపై సాక్షి మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారు.. మంత్రి నిమ్మల ధ్వజం



పశ్చిమగోదావరి ఆగస్టు 05(టుడే విదుర) : వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఆంధ్రప్రదేశ్ మంత్రి నిమ్మల రామానాయుడు సంచలన వ్యాఖ్యలు చేశారు. జగన్ పాలనలోనే రెడ్ బుక్ రాజ్యాంగం నడిచిందని విమర్శించారు. ఇవాళ(మంగళవారం) పాలకొల్లులో మంత్రి నిమ్మల రామానాయుడు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మీడియాతో మాట్లాడారు. దాడులు, కక్షలు, అక్రమ కేసులు విధ్వంస పాలనే తప్ప ప్రజా సంక్షేమాన్ని జగన్ పట్టించుకోలేదని ధ్వజమెత్తారు.టిడ్కో గృహాల ప్రారంభోత్సవ సభలో కత్తిలాంటి బటన్ స్టిక్‌లు పట్టుకుని తమను స్టేజిపై నుంచి గెంటివేసినప్పుడు ఈ సాక్షి దినపత్రిక ఏమైందని ప్రశ్నించారు. తమపై దాడులు చేసి తమపైనే ఎస్సీ, ఎస్టీ కేసులు పెట్టిన వారిపై తాము రక్షణ కోసం పోలీసులను ఆశ్రయించడం తప్పా అని నిలదీశారు. తాము మంజూరు చేసి నిర్మించిన టిడ్కో సముదాయంలో ఒక్కొక్క ఇంటిపై రూ.3.65 లక్షలు రుణం తీసుకొని కోట్లాది రూపాయలను జగన్ ప్రభుత్వం దారి మళ్లించిందని ధ్వజమెత్తారు మంత్రి నిమ్మల రామానాయుడు.పాలకొల్లుకు చెందిన వైసీపీ నాయకులు క్రికెట్ బెట్టింగ్‌లో దొరికినా, అక్రమ సంపాదనలు వెలుగు చూసినా అరాచకాలను సాక్షి దినపత్రిక ఎందుకు ప్రచురించడం లేదని ప్రశ్నల వర్షం కురిపించారు. తాను బాధ్యతాయుతంగా పనిచేస్తుంటే సాక్షి దినపత్రికలో కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో వివిధ శాఖల నుంచి రూ. 430 కోట్ల పనులు నియోజకవర్గంలో జరుగుతున్నాయని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.

## జైళ్ల ఆధునీకరణకు కీలక నిర్ణయం తీసుకున్నామన్నా మంత్రి అనిత



విజయవాడ,ఆగస్టు 05(టుడే విదుర) : ఈ రాష్ట్రంలో జైళ్ళ ఆధునీకరణ, ఖైదీల సంక్షేమం దిశలో కీలక చర్యలు తీసుకుంటున్నామని హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో హోం మంత్రి వంగలపూడి అనిత అధ్యక్షతన జైళ్లశాఖపై సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా జైళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటు, సత్ప్రవర్తన కలిగిన ఖైదీల విడుదల, మౌలిక వసతుల కల్పన, పోస్టుల భర్తీ తదితర అంశాలపై సమగ్ర చర్చించారు. హోం మంత్రి అనిత మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలోనే జైళ్లశాఖలో అనేక సంస్కరణలు చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్రంలోని 122 జైళ్లకు అవసరమైన వసతుల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని వెల్లడించారు జైళ్లశాఖలో ఖాళీగా ఉన్న పోస్టులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెలతా మన్నారు. ఇప్పటికే ఇద్దరు డిప్యూటీ సూపరింటెండెంట్లు నియమితులైనట్లు, మరో వ్యక్తిని నియమించే ప్రక్రియ కొనసాగుతోందని, 2025 జాబ్ కేలండర్లో మరొక పోస్టు భర్తీకి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కడప సెంట్రల్ జైల్లో ఫ్యాక్టరీ బ్యారక్ విజయనగరం బోర్సల్ స్కూల్లో లివింగ్ బ్యారక్ రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో ఒక్కో బ్లాక్ లో 120 ఖైదీల సామర్థం గల రెండు కొత్త బ్లాక్ లు నెల్లూరు పరిధిలో జైలు వార్డర్లకు 36 క్వార్టర్లు.. రూ.1.16 కోట్లతో అనంతపురం అగ్రికల్చర్ కాలనీలో డిప్యూటీ జైలర్ల భవనాల నిర్మాణం, కడప సెంట్రల్ జైల్లో ఎలక్ట్రికల్ పనులు చేపట్టినట్లు తెలిపారు.

## విజయవాడలో ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు కొత్త యాప్




విజయవాడ,ఆగస్టు 05(టుడే విదుర) : విజయవాడలో ట్రాఫిక్కు రద్దీని నియంత్రిం చేందుకు పోలీసులు పలు సాంకేతికంశాలను వినియోగిస్తున్నారు. ఇంటెలిజెన్స్ ట్రాఫిక్ మేనేజ్మెంట్ సిస్టంతో జంక్షన్ల వద్ద ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపడుతున్నారు. రద్దీపై నిఘా ఉంచేందుకు అస్త్రం యాప్ను తీసుకొచ్చారు. ట్రాఫిక్ నియంత్రణకు ముందస్తు ప్రణాళిక: విజయవాడ నగరంలోని ఫంక్షన్ హాళ్ల వివరాలను ఈ అస్త్రం యాప్లో పొందుపరిచారు. ఏదైనా ప్రాంతంలో కార్యక్రమం జరుగుతుంటే ముందుగానే నిర్వాహకులు అందుకు సంబంధించిన వివరాలను యాప్ లో నమోదు చేస్తారు. కార్యక్రమానికి ఎన్ని వాహనాలు వస్తాయి? వీఐపీల వివరాలు ఇలా అన్నీ ఇందులో ఉంచుతారు. తద్వారా పోలీసులు ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ మళ్లింపులు వంటి జాగ్రత్తలు తీసుకునేందుకు వీలుంటుంది. ముందుగానే సమాచారం రావడంతో ట్రాఫిక్ జామ్లు గణనీయంగా తగ్గినట్లు తెలుస్తోంది. విజయవాడ నగరంలోని ట్రాఫిక్ సమాచారం తెలుసుకునేం దుకు పోలీస్ యంత్రాంగం ఈ అస్త్రం యాప్ను రూపొందించారు. నగరంలో ఎక్కడైనా వాహనాలు నిలిచిపోతే ఈ యాప్ కి తక్షణం సమాచారం వస్తుంది. 300 మీటర్ల వరకు వాహనాలు నిలిచిపోతే మోడరేట్, 300 నుంచి 500 మీటర్ల వరకు వాహనాలు నిలిచిపోతే హై లెవల్ అని, 500 మీటర్లు మేర ట్రాఫిక్ నిలిచిపోతే సివియర్డ అని మెసేజ్ చూపిస్తుంది. ఈ సందేశాలకు సంబంధిత ప్రాంతాల ట్రాఫిక్ సీఐలు, ఇతర యంత్రాంగం తక్షణం స్పందిస్తారు. మోడరేట్ లెవల్ లో ఉన్నప్పుడే ఆ ప్రాంతానికి హుటాహుటిన చేరుకుంటారు. మోడరేట్ లెవల్ ట్రాఫిక్కు హై వరకు చేరకుండా ఉండేలా చర్యలు తీసుకుంటారు. సమాచార విశ్లేషణకు కమాండ్ కంట్రోల్: అస్త్రం యాప్ పంపించే సమాచారాన్ని కమాండ్ కంట్రోల్ సెంటర్ లో విశ్లేషిస్తారు. దీని కోసం వెర్టికల్ మేసేజ్ సిస్టం అందుబాటులోకి తీసుకొచ్చారు.

## ఏం డౌట్ వద్దు.. అక్రమార్కులు తప్పించుకోలేరు

కర్నూలు,ఆగస్టు 05(టుడే విదుర): అక్రమార్కులెవరూ తప్పించుకోలేరని ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి అన్నారు. పట్టణంలోని ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఎమ్మిగనూరు పట్టణంలో 2008లో మంజూరై 2009లో అప్పటి ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి హయాంలో రూ. 44కోట్లతో ప్రారంభమై నేటికి అసంపూర్తిగా ఉన్న యూజీడీ(అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ)లో జరిగిన అక్రమాలపై విచారణ కమిటీ వేస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డిపై విచారణకు వైసీపీ నాయకులే పరోక్షంగా కోరుతున్నారన్నారు.వైసీపీకి చెందిన నాయకులు పట్టణంలో యుజీడీ పూర్తి చేశామని, ఇందులో అవినీతి అక్రమాలు జరిగాయని, ప్రజాప్రతినిధి మేల్కోవాలని, విచారణచేయాలని ఓ వీడియోలో చెప్పారన్నారు. వారు కోరిన విధంగా త్వరలో విచారణ చేయిస్తామన్నారు.

## మరింత కొత్తగా.. వినూత్నంగా రేషన్ కార్డ్స్ అందిస్తాం : మంత్రి నాదెండ్ల



విశాఖపట్నం, ఆగస్టు 05(టుడే విదుర) : రాష్ట్రంలో మరింత కొత్తగా.. వినూత్నంగా రేషన్ కార్డ్స్ అందిస్తామని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. రేషన్ సరుకులను ఆగస్టు 25 నుంచి కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా పంపిణీ చేస్తామని అన్నారు. విశాఖలో ఆయన మీడియాతో మాట్లాడారు..

ఏటీఎం కార్డు సైజులో..

ఏటీఎం కార్డు సైజులో నూతన రేషన్ కార్డులు ఉండబోతున్నాయని మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. కొన్ని మ్యాపింగ్ సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. రేషన్ షాపులు ద్వారా జీసీసీ ఉత్పత్తులు అందించే నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. నాలుగు కోట్ల మందికి రేషన్ సరుకులు అందిస్తామని ధీమా వ్యక్తం చేశారు. గ్యాస్ రాయితీ విషయంలో కూడా డిజిటల్ వారెంట్ కూపన్ను అందిస్తున్నట్లు తెలిపారు.

పంపిణీ ఇలా...

మూడు రోజులు ఉత్తరాంధ్రలో పర్యటించినట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ గుర్తు చేశారు. పౌర సరఫరాల శాఖ ద్వారా ప్రజలకు ఉత్తమ సేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. నెలలో 15 రోజుల పాటు రేషన్ సరుకులు అందజేస్తామని పేర్కొన్నారు. 65 సంవత్సరాల వయస్సు దాటిన వృద్ధులకు, వికలాంగులకు ప్రతి నెలా 26 నుంచి 30వ తేదీ వరకు ఇంటివద్దకే సరకులు అందిస్తామని వివరించారు. ఎండీయూ వాహనాలు తొలగింపు విషయంలో సుమారు రూ.200 కోట్లు నష్టం జరిగిన ముందుకు వెళ్ళామని నాందెడ్ల మనోహర్ చెప్పుకొచ్చారు. దీపం పథకం ద్వారా ఫేజ్-1లో కోటి మందికి, ఫేజ్ 2లో 95 లక్షల మందికి సబ్సిడీ అందించినట్లు తెలిపారు. గ్యాస్ డెలివరీ బాయ్స్ ప్రజల నుంచి చార్జీలు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీనిపై ఇప్పటికే ఆయా అధికారులకు మార్గదర్శకాలు జారీ చేశాని ఆయన స్పష్టం చేశారు. అలాగే.. రేషన్ బియ్యం అక్రమ తరలింపుపై నిఘా పెట్టినట్లు, చట్టంలో మార్పులు కూడా తీసుకొచ్చినట్లు ఆయన వివరించారు. ప్రభుత్వ పథకాల అమలు విషయంలో తప్పు ఎవరు చేసినా కఠిన చర్యలు ఉంటాయని మంత్రి నాదెండ్ల మనోహర్ హెచ్చరించారు.

## మిథున్‌రెడ్డి బెయిల్‌పై కోర్టు కీలక నిర్ణయం



విజయవాడ, ఆగస్టు 05(టుడే విదుర): లిక్కర్ స్కామ్ కేసులో వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి బెయిల్ పిటిషన్‌పై మంగళవారం వాదనలు ముగిశాయి. ఈ నేపథ్యంలో ఏసీబీ కోర్టు తన తీర్పును రిజర్వ్ చేసింది. ఈ నెల 12వ తేదీ బెయిల్ పిటిషన్‌పై ఏసీబీ కోర్టు ఉత్తర్వులు జారీ చేయనుంది. అయితే లిక్కర్ స్కామ్ కేసులో ఏ4గా మిథున్ రెడ్డి ఉన్న సంగతి తెలిసిందే. ఇదే కేసులో అరెస్టయిన ఆయన.. ప్రస్తుతం రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు.

ఈ రోజు ఏసీబీ కోర్టులో ఏం జరిగిందంటే..

ఈ మద్యం స్కామ్‌కు సంబంధించి ముగ్గురు వ్యక్తులు ఇచ్చిన స్టేట్‌మెంట్‌లో ఎక్కడా మిథున్ రెడ్డి పాత్ర ఉందని చెప్పలేదంటూ ఆయన తరఫు న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకు వెళ్లారు. అలాగే మిథున్ రెడ్డిని సిట్ కస్టడీకి ఇప్పటి వరకు కోరలేదని వారు తెలిపారు. లిక్కర్ స్కామ్ జరగలేదని.. ఈ కేసులో అసలు మిథున్ రెడ్డి పాత్ర లేదని ఏసీబీ కోర్టుకు వారు స్పష్టం చేశారు. దాంతో మిథున్ రెడ్డికి బెయిల్ మంజూరు చేయాలని కోర్టును కోరారు.

ఇక సెట్ తరఫు న్యాయవాదులు వాదిస్తూ.. డి కార్ట్ లాజిస్టిక్స్, స్నై ఆగ్రోస్ నుంచి నగదు మిథున్ రెడ్డి కంపెనీల్లో బదిలీ జరిగింది ఏసీబీ కోర్టుకు ప్రభుత్వ తరఫు న్యాయవాది ఈ సందర్భంగా తెలియజేశారు. పీఎల్ఆర్ కంపెనీ లావాదేవీల్లో లిక్కర్ నగదు బదిలి అయినట్లు సిట్ ఇప్పటికే గుర్తించిందని ప్రభుత్వ తరఫు న్యాయవాది కోర్టుకు విన్నవించారు. ఈ నేపథ్యంలో మిథున్ రెడ్డికి బెయిల్ మంజూరు చేయవద్దంటూ కోర్టును అభ్యర్థించారు. మంగళవారం ఈ వాదనలు విన్న ఏసీబీ కోర్టు తన తీర్పును రిజర్వు చేస్తున్నట్లు ప్రకటించింది.

## రాత్రి రెక్కీ.. పగలు దొంగతనం.. పోలీసులకు సవాల్‌గా మారుతున్న వరుస చోరీలు





%రెంటచింతల, ఆగస్టు 05(టుడే విదుర): మండల కేంద్రమైన రెంటచింతలలోని రేంజర్ వీదిలో(రైస్ మిల్ వద్ద) రాత్రి టీచర్ల గృ హంలో భారీ దొంగతనం జరిగింది. దంపతులిద్దరూ ఊరెళ్లడంతో.. దొంగలు ఇనుప రాడ్‌తో తాళాలు, బీరువాను పగలకొట్టి బంగారు ఆభరణాలు, నగదును దోచుకెళ్లారు. గుంటూరు జిల్లా పోలీసులు సేకరించిన వివరాల మేరకు... గెల్లిపోగు జనార్ధనరావు, సుమతి గ్రేస్ భార్యభర్తలు. జనార్ధనరావు జెట్టిపాలెం మోడల్ స్కూల్లో ఎకనామిక్స్ అధ్యాపకుడిగా... సుమతి గ్రేస్ స్థానిక విద్యాశాఖలో సీఆర్పీగా పనిచేస్తున్నారు. జనార్ధనరావు తల్లి మరియమ్మ అస్వస్థతకు లోనుకావడంతో.. పలకరించేందుకు వారు మాచర్లకు వెళ్లారు. ఉదయం రెంటచింతల ఇంటికి వచ్చి చూడగా.. తాళాలు పగలకొట్టి తలు పులు, బీరువా తెరిచి ఉండటం గమనించారు. చోరీ జరిగినట్లు నిర్ధారించకున్నారు. బీరువాలో ఉంచిన శంకరాభరణం బు ట్టలు, హ్యాంగర్స్, చైన్లు, ఉంగరాలు, కెంపుల పచ్చల బుట్టలు దాదాపు 122 గ్రాముల ఆభరణాలు గురయ్యాయని తెలిపారు. అలాగే జనార్ధనరావు పాపకు పదోతరగతిలో మంచి మార్కులు రావడంతో పాఠశాల నుంచి వచ్చిన బహుమతి రూ.20 వేల నగదును పట్టుకుపోయారని తెలిపారు. ఘటన స్థలాన్ని కారంపూడి సీఐ టీవీ శ్రీనివాసరావు, ఎస్ఐఐ సీహెచ్ నాగార్జున సందర్శించి బాధితుల నుంచి వివరాలను నమోదు చేసుకున్నారు. అలాగే గుంటూరు నుంచి వచ్చిన క్లూస్ టీం వేలిముద్రలను సేకరించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. గెల్లిపోగు జనార్ధనరావు మాస్టార్ బావమర్ది ప్రసాద్ మాస్టర్ గృహంలో కూడా 2022 ఆగస్టు 19న దొంగతనం జరిగింది. భార్యభర్తలిద్దరూ స్కూల్‌కి వెళ్లి ఇంటికొచ్చేసరికి రూ.3.45 లక్షలు విలువైన బంగారం, నగలు అపహరించుకెళ్లారు. మిర్యాలగూడకు చెందిన నేరస్తుడిని అప్పటి ఎస్ఐ సమీర్ బాష పట్టుకుని కొంత సొమ్మును రికవరీ చేశారు.

## మట్టి గణపతికే జై!

**పారిశ్రామిక ప్రాంతంలో సిద్ధమవుతున్న విగ్రహాలు**

**కోల్‌కత్తా, పెందుర్తి ఎర్రమట్టితో తయారీ**

**' వివిధ ఆకృతుల్లో రూపుదిద్దుతున్న కళాకారులు**



మల్కాపురంఆగస్టు 05(టుడే విదుర): పర్యావరణ పరిరక్షణలో భాగంగా కొన్నేళ్లుగా మట్టి విగ్రహాలతో ఉత్సవాలు జరిపేందుకు నిర్వాహకులు ఆసక్తి చూపిస్తున్నారు. అయితే తాము అనుకున్న ఎత్తులో మట్టి ప్రతిమలు లభ్యం కాకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలనే మండపాల్లో కొలువుదీరుస్తున్నారు. ఈ ఏడాది ఆ సమస్యకు పరిష్కారం లభించినట్టే. మల్కాపురం ఎస్సీ కాలనీలో కోల్‌కత్తాకు చెందిన కళాకారులు పూర్తిస్థాయిలో నిర్వాహకుల ఆసక్తి తగ్గట్టుగా వివిధ రూపాల్లో మట్టి వినాయక విగ్రహాలను రూపొందిస్తున్నారు. పారిశ్రామిక ప్రాంతం మట్టి వినాయక విగ్రహాలకు కేంద్రంగా మారుతోంది. ఇక్కడ మూడునెలలుగా విగ్రహాల తయారీ సాగుతోంది. కోల్‌కత్తాకు చెందిన కళాకారులు వీటిని మట్టితోనే రూపొందిస్తుండటం విశేషం. %మల్కాపురం ఎస్సీ కాలనీకి చెందిన కళాకారుడు అనపర్తి సైదులు విగ్రహాల తయారీలో కీలకపాత్ర పోషిస్తున్నారు. విగ్రహాల తయారీకి వీలుగా కోల్‌కత్తా నుంచి ప్రత్యేకమైన మట్టిని లారీల్లో తీసుకువచ్చారు. దీనికి పెందుర్తి ప్రాంతంలో లభ్యమయ్యే ఎర్రమట్టిని జోడించి అందమైన విగ్రహాలను రూపొందిస్తున్నారు. ముందుగా గడ్డి, ఊక, గోగు నార కర్రలతో విగ్రహాల నమూనాను సిద్ధం చేస్తున్నారు. అనంతరం ఆ విగ్రహానికి మట్టిని అద్ది, తుదిరూపును తీసుకువస్తున్నారు. ఈ నేపథ్యంలో ఒక్కో విగ్రహం సిద్ధం చేసేందుకు సుమారు 20 రోజుల సమయం పడుతోందని చెబుతున్నారు. మట్టి విగ్రహాల తయారీలో నిపుణులైన కళాకారులను కోల్‌కత్తా నుంచి రప్పించి, రేయింబవళ్లు విగ్రహాలను తీర్చిదిద్దుతున్నారు. నగరంలో వీలైనన్ని మండపాల్లో మట్టి వినాయక ప్రతిమలే ప్రతిష్ఠించేందుకు వీలుగా ఈ ఏడాది గణపతి నవరాత్రి నిర్వాహకులకు అందుబాటులో ఉంచాలనే ధ్యేయంతోనే ముందుగానే సిద్ధం చేస్తున్నామని కళాకారుడు సైదులు తెలిపారు.

## కేకే రైలు మార్గంపై పడిన కొండ చరియ



అనంతగిరిఆగస్టు 05(టుడే విదుర): కేకే (కొత్తవలస-కిరండూల్) రైలు మార్గంలో అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం బొర్రా-చిమిడిపల్లి స్టేషన్ల మధ్య టన్నెల్ 32బీ సమీపంలో ఉన్న బ్రిడ్జిపై పక్కనున్న కొండ పైనుంచి భారీ బండరాయి ఒకటి జారిపడింది. దీంతో పట్టాలు, ఓహెచ్‌సీ కేబుల్ దెబ్బతిన్నాయి. దీంతో రైళ్ల రాకపోలకు అంతరాయం ఏర్పడింది. యుద్ధప్రతిపాదికన రైల్వే సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మరమ్మతు పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ ఘటన నేపథ్యంలో కిరండూల్ నుంచి విశాఖపట్నం వెళుతున్న పాసింజర్ రైళ్లను అరకులోయ మండలం కరకవలస వద్ద నిలిపివేశారు. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

## ట్రాఫిక్ ఉల్లంఘనలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్‌లు



అమరావతిఆగస్టు 05(టుడే విదుర): రోడ్డు ప్రమాదాల నుంచి ప్రజలను కాపాడేందుకు ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్‌లు చేపట్టాలని డీజీపీ హరీషకుమార్ గుప్తా సూచించారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారుల ట్రాఫిక్ ఉల్లంఘనలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ డ్రైవ్‌లు వారానికి ఒకసారి చొప్పున నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం అమల్లోకి వస్తాయని పోలీసుశాఖ ప్రకటించింది. ఆగస్టు 4 నుంచి 10 వరకు 'మద్యం సేవించి వాహనం నడపొద్దని హెచ్చరికతో డ్రైవ్', ఆగస్టు 11 నుంచి 17 వరకు.. వేగం మితిమీరిన వాహనాలపై చర్యలు, ఆగస్టు 18నుంచి 24 వరకు హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడిపేవారు, అలాగే పిలియన్ రైడర్లపై చర్యలు ఉంటాయన్నారు.

## అక్కా.. వచ్చి నన్ను తీసుకెళ్లు!



తిరుపతి,ఆగస్టు 05(టుడే విదుర): 'అయ్యా.. మా అక్కకి నేనంటే చాలా ఇష్టం. విజయనగరం జిల్లా నెల్లిమర్లలో బృందావన్ అపార్టుమెంట్‌లో ఉంటుంది. తిరుపతిలో ఇట్లా రోడ్డు పక్కన పడి ఉన్నానని చెప్పండి.. వచ్చి తీసుకువెళ్తుంది.. ఎట్లయినా నన్ను మా అక్క దగ్గరకి చేర్చండి' అని కన్నీళ్లు పెట్టుకుంటున్నాడు తిరుపతిలోని అలిపిరి సమీపంలో పేవ్‌మెంట్ మీద ఎముకల పోగులా పడి ఉన్న 60 ఏళ్ల వ్యక్తి. నెలన్నరగా అతను ఎండకీ, వానకీ అక్కడే పడిఉన్నాడు. అలిపిరిలో అనాథలకు సేవ చేసే సుజాత అతని పరిస్థితి చూసి రోజూ అన్నం పెడుతున్నారు. అన్నీ ఒంట్లోనే పోతుండడంతో తన కుమారుడి సాయంతో ఆమె శుభ్రం చేస్తోంది. వారి సపర్యలతో కాస్త కోలుకున్న తర్వాత ఆ వ్యక్తి తన వివరాలు చెబుతున్నాడు. తన పేరు కోరుమెల్లి వెంకట్రావు అని, తానొక హార్డ్‌వేర్ ఇంజనీరునని, విశాఖపట్నంలో ఒక ప్రైవేటు కంపెనీలో పనిచేశానని చెప్పాడు. భార్యా పిల్లలు లేరని, నెల్లిమర్లలో తన అక్క అరుణ పాటక్ ఉంటుందని చెబుతున్నాడు. తిరుమలకు దర్శనం కోసం ఒక్కడినే వచ్చానని.. అన్నదాన సత్రం దగ్గర హఠాత్తుగా కళ్లు తిరిగి పడిపోయానని తెలిపాడు. అంబులెన్సులో తిరుపతి రుయా ఆసుపత్రికి పంపారని, తన వివరాలు చెప్పలేకపోవడంతో రెండ్రోజుల తర్వాత బయటకు పంపేశారన్నాడు. కదల్లేని స్థితిలో ఉన్న ఆయన్ను కుటుంబ సభ్యులెవరైనా గుర్తించి తీసుకువెళ్లాలని ఆయనకు సేవ చేస్తున్న సుజాత కోరుతున్నారు.



# కలెక్టర్ సారూ.. కంపు కంపు!

**నీలమ్మకాలనీ - తోటపాలెం రోడ్డులో అధ్వానంగా మురుగు కాలువ**
**శ్రీకాకుళంలో అధ్వానంగా పారిశుధ్యం**
**%కాలువల్లో పేరుకుపోతున్న పూడిక**
**రోడ్లపై ప్రవహిస్తున్న మురుగునీరు**
**జిల్లా కేంద్రంలోనే అపరిశుభ్రత**
**వర్షం వస్తే ఇక్కట్లు అన్నీఇన్నీ కావు**

ఆగస్టు 05(టుడే విదుర): శ్రీకాకుళం నగరపాలక సంస్థకు కలెక్టర్ ప్రత్యేకాధికారి. కార్పొరేషన్ పాలకవర్గం లేనందువల్ల ఆయన ఆధ్వర్యంలోనే పాలన నడుస్తుంది. కలెక్టర్‌తో పాటు ఇతర జిల్లా అధికారుల కార్యాలయాలు నగరంలోనే ఉంటాయి. అలాంటిచోట పరిశుభ్రత అధ్వానంగా ఉంది. వీధులు, రోడ్ల పక్కన కాలువలు కంపు కొడుతున్నాయి. ఇక వర్షం వస్తే రోడ్లపైకి మురుగునీరు వస్తుంది. ఇళ్లలోకి కూడా ప్రవేశిస్తుంది. ఇలా ఉంటే వ్యాధులు విజృంభించవా మరి! నగరాన్ని శుభ్రంగా ఉంచండి మహాప్రభో! అంటూ ప్రజలు ఎన్నిసార్లు వేడుకున్నా.. వినతులు ఇచ్చినా ఫలితం లేదు.శ్రీకాకుళం అర్బన్,: పేరు గొప్ప.. ఊరు దిబ్బ అన్నట్టుంది శ్రీకాకుళం నగర పాలక సంస్థ దుస్థితి. మునిసిపాలిటీ నుంచి కార్పొరేషన్‌గా పదేళ్ల కిందట అప్‌గ్రేడ్ చెందినా.. వసతులు మాత్రం మెరుగుపడలేదు. సమస్యలు పరిష్కారం కావడం లేదు. 2011 జనాభా లెక్కల ప్రకారం శ్రీకాకుళం నగరంలో లక్షమందికిపైగా జనాభా ఉన్నారు. ఈ పద్నాలుగేళ్లలో జనాభా రెట్టింపు అయ్యారు. కానీ ప్రజల అవసరాలకు తగ్గట్టు వసతులు లేవు. ముఖ్యంగా పారిశుధ్యం నిర్వహణ దారుణంగా ఉంది. దశాబ్దాల కిందట నాటి డ్రైనేజీ వ్యవస్థ కొనసాగుతోంది. మురుగు కాలువలు, వాటి మదుములు పూర్తిగా ధ్వంసమయ్యాయి. దీంతో మురుగునీటి ప్రవాహం సరిగ్గా సాగడం లేదు. ప్లాస్టిక్ వ్యర్థాలు, ఖాళీ సీసాలు, చెత్త పేరుకుపోయి ఎక్కడికక్కడ మురుగునీరు కాలువలపై నుంచి రోడ్లపైకి వస్తోంది. దీంతో నగరవాసులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. జిల్లా కలెక్టర్ కార్పొరేషన్ ప్రత్యేకాధికారిగా ఉన్నారు. ఆయన ఆధ్వర్యంలోనే పాలన నడవాలి. తరచూ కార్పొరేషన్ అధికారులతో సమావేశమై పర్యవేక్షించాలి. కానీ ఆయన ప్రత్యేకాధికారిగా ఉన్న నగరం ఇలా అపరిశుభ్రంగా తయారు కావడంపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అలాగే నగరం నుంచి ఎమ్మెల్యేగా గొండు శంకర్ ఉన్నారు. ఆయన కూడా తరచూ నగరంలో తిరుతుంటారు. తమ కష్టాలు ఎమ్మెల్యే అయినా పట్టించుకోవాలని ప్రజలు కోరుతున్నారు.శ్రీకాకుళంలో ఆర్టీసీ కాంప్లెక్స్, మిర్తిబట్టి, పాలకొండ రోడ్డు, ప్రధాన మెయిన్‌రోడ్డు, డేఅండ్‌నైట్ జంక్షన్, అరసవల్లి రోడ్డు, 80అడుగుల రోడ్డు, రామలక్ష్మణ జంక్షన్, ఇలా 14 ప్రధాన ప్రాంతాల్లో ఉన్న మురుగు కాలువల్లో పూడిక పేరుకుపోతోంది. దీంతో చిన్న వర్షం పడినా మురుగునీరు రోడ్డుపైనే ప్రవహిస్తోంది. ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఎప్పుడూ వర్షపు నీరు నిలిచిపోతుంటుంది. కాలువల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు మురుగునీరు ప్రవాహానికి ప్రతిబంధకాలుగా మారాయి. అలాగే నీలమ్మకాలనీ నుంచి తోటపాలెం వెళ్లే రోడ్డులో మురుగు కాలువలో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయాయి. పాలిటెక్నిక్ కళాశాలకు వెళ్లే రోడ్డులో కూడా కాలువ సరిగా లేక.. రోడ్డుపై మురుగునీరు నిలిచిపోతోంది. కోడిరామ్మూర్తి స్టేడియం వద్ద కాలువ నుంచి మురుగునీరు.. రోడ్డుపై ప్రవహించి గుంతల్లో చేరుతోంది. శాంతినగర్ కాలనీలోనూ ఇదే పరిస్థితి. ఇలా నగరంలో ఏ వీధి చూసినా ఇదే దుస్థితి. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పుడప్పుడూ కాలువల్లో ఉన్న చెత్తాచెదారాలు తొలగిస్తున్నారు. కానీ వారం రోజుల తర్వాత పరిస్థితి షరామామూలుగానే మారుతోందని నగర ప్రజలు వాపోతున్నారు.శ్రీకాకుళంలో అన్ని ప్రాంతాల కాలువల నుంచి నాగావళి నదిలోకి మురుగు కలుస్తుంది. దీనితో నది కాలుష్యం తగ్గించేందుకు రూ.36కోట్లతో కొన్నేళ్ల కిందట సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్(ఎస్‌టీపీ) పనులు ప్రారంభించారు. కాలువల నుంచి వచ్చే మురుగునీటిని ఎస్‌టీపీలోకి చేర్చి అక్కడ ఆ నీటిని శుద్ధి చేసి అనంతరం నాగావళి నదిలోకి వదిలేందుకు ప్రణాళిక రచించారు. అమృత్ నిధులతో చేపట్టిన ఈ పనులు ఏడాది నుంచి నిలిపేశారు. దీనితో మురుగు నేరుగా నదిలోకి కలుస్తోంది. ఇప్పటికైనా ఎస్‌టీపీ పనులు పూర్తి చేయాలని, ప్రధాన జంక్షన్ల వద్ద ఉన్న కాలువల్లో పూడిక తొలగించాలని నగర ప్రజలు కోరుతున్నారు. పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## నాటు తుపాకితో ప్రియురాలు, ఆమె భర్తపై కాల్పులు



శంఖవరం, ఆగస్టు 05(టుడే విదుర): కాకినాడ జిల్లా శంఖవరం మండలం శృంగధారలో అర్ధరాత్రి ఓ వ్యక్తి ఇద్దరిని నాటు తుపాకితో కాల్చి పరారయ్యాడు. అన్నవరం పోలీసుల కథనం మేరకు.. కాకినాడ జిల్లా పెద మల్లాపురం పంచాయతీ పరిధి శృంగధారకు చెందిన కాకురు చంద్రరావుకు, అదే గ్రామానికి చెందిన కుమారికి ఐదేళ్ల క్రితం పెళ్లి జరిగింది. వారికి ముగ్గురు పిల్లలు. అయితే కుమారికి అల్లూరి జిల్లా రాజవొమ్మంగి మండలం వంతంగి గ్రామానికి చెందిన సరమండ మణికుమార్‌తో వివాహేతర సంబంధం ఏర్పడింది. కొంతకాలం వారిద్దరూ సహజీవనం కూడా చేశారు. ఈ క్రమంలో 4 రోజుల క్రితం తనకు పిల్లలు, భర్త కావాలనుకుని కుమారి ప్రియుడిని వదిలి శృంగధార వచ్చేసింది. తనతో మూడేళ్ల సహజీవనం చేసి వదిలేసిందనే కోపంతో మణికుమార్ అర్ధరాత్రి నాటు తుపాకితో కుమారి, ఆమె భర్త చంద్రరావుపై కాల్పులు జరిపాడు. దీంతో వారికి గాయాలయ్యాయి. తుపాకి శబ్దంతో ఉలిక్కిపడ్డ గ్రామస్తులు ఘటనా స్థలానికి చేరుకోగా అప్పటికే మణికుమార్ పరారయ్యాడు. క్షతగాత్రులను ప్రత్తిపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామని, పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నామని అన్నవరం ఎస్‌ఐ శ్రీహరిబాబు తెలిపారు.

## గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు తీవ్ర పోటీ




ఆగస్టు 05(టుడే విదుర): ఆంధ్ర విశ్వవిద్యాలయంలో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి చేపట్టిన ఇంటర్వ్యూలు తో ముగిశాయి. ఆర్ట్స్, సైన్స్, ఇంజనీరింగ్ కాలేజీ పరిధిలోని వివిధ విభాగాల్లో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి గత నెల నోటిఫికేషన్ ఇవ్వగా, సుమారు 1,400 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఆయా దరఖాస్తులను పరిశీలించిన అధికారులు 1,250 మందిని ఇంటర్వ్యూలకు పిలిచారు. వారికి గడిచిన నాలుగు రోజుల నుంచి ఇంటర్వ్యూలు నిర్వహిస్తూ వస్తున్నారు. రాత్రి 9 గంటలకు ఆ ప్రక్రియను ముగించారు. ఎంపికైన అభ్యర్థులకు రెండు రోజుల్లో సమాచారాన్ని అందించనున్నారు.గతంలో ఎన్నడూ లేని విధంగా గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు భారీగా దరఖాస్తులు వచ్చాయి. ఆన్‌లైన్‌లో నోటిఫికేషన్ ఇవ్వడంతో రాష్ట్రానికి చెందినవారే కాకుండా హైదరాబాద్ వంటి ప్రాంతాలకు చెందినవారు కూడా దరఖాస్తు చేసుకున్నారు. గెస్ట్ ఫ్యాకల్టీగా ఎంపికైన అభ్యర్థులు వారానికి మూడు నుంచి నాలుగు తరగతులు బోధించాల్సి ఉంటుంది. అందుకుగాను ఆరు నెలలకు రూ.45 వేలు చొప్పున చెల్లించనున్నారు. ఈ పోస్టులకు పూర్తిస్థాయిలో సమయాన్ని వెచ్చించాల్సిన అవసరం లేకపోవడంతో అనేక రంగాలకు చెందినవారు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ఇప్పటికే వర్సిటీలోని వివిధ విభాగాల్లో పనిచేసి పదవీ విరమణ చేసిన అధ్యాపకులు కూడా ఉన్నారు. ఇలా పదవీ విరమణ చేసిన ఉద్యోగులు ఆరుగురు వరకు ఇంటర్వ్యూలకు హాజరైనట్టు తెలిసింది. అలాగే, గ్రామ/వార్డు సచివాలయాల్లో పనిచేస్తూ పీహెచ్‌డీ అర్హత ఉన్న కొందరు దరఖాస్తు చేసుకున్నారు. తెలంగాణలోని ?హైదరాబాద్ ప్రాంతానికి చెందినవారు కూడా పెద్దఎత్తున దరఖాస్తు చేసుకున్నారు. అయితే, రిటైర్డ్ ఉద్యోగులు, సచివాలయాల్లో పనిచేసే సిబ్బంది, తెలంగాణకు చెందిన వారి దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోవడం పట్ల కొందరు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పదవీ విరమణ చేసిన వారిని, ఇతర ఉద్యోగాలు చేస్తున్న వారిని ఇంటర్వ్యూలకు పిలవడం దారుణమంటున్నారు. దీనిపై అధికారులు మాత్రం స్పందించడం లేదు.

## కలెక్టరేట్ ఎదుట మూగ మహిళ ఆత్మహత్యాయత్నం

ఆగస్టు 05(టుడే విదుర): కలెక్టరేట్ ఎదుట బధిరురాలైన (మూగ) ఓ మహిళ తనతోపాటు ఇద్దరు పిల్లలపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అక్కడే వున్న అనకాపల్లి రూరల్ సీఐ అశోక్‌కుమార్, ఎస్‌ఐ రవికుమార్ అడ్డుకొన్నారు. ఆమె సమస్యను కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ తుహిన్‌సిన్హా దృష్టికి తీసుకువెళ్లారు. కలెక్టర్ స్పందించి కౌన్సెలింగ్ ఇవ్వడంతోపాటు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇందుకు సంబంధించి బాధితురాలి కుమార్తె పల్లవి తెలిపిన వివరాలిలా వున్నాయి.మునగపాక మండలం తోటాడ సిరసపల్లి గ్రామానికి చెందిన యాండ్ర సంతోషమ్మకు పుట్టుకతోనే బధిరురాలు. కొన్నేళ్ల క్రితం దుర్గాప్రసాద్ అనే లారీ డ్రైవర్ ఈమెను వివాహం చేసుకున్నాడు. అనంతరం వీరికి కుమారుడు, కుమార్తె కలిగారు. ప్రస్తుతం కుమారుడు సంజీవ్ పదో తరగతి, కుమార్తె పల్లవి తొమ్మిదో తరగతి చదువుతున్నారు. కాగా దుర్గాప్రసాద్ కొద్ది రోజుల నుంచి భార్యతో గొడవపడుతూ ఆమెను చిత్రహింసలకు గురి చేస్తున్నాడు. గత నెల పదో తేదీన డ్రైవర్ విధులు ముగించుకుని ఇంటికి వచ్చిన దుర్గాప్రసాద్.. భార్యతోపాటు పిల్లలను కూడా కొట్టాడు. వేధింపులు భరించలేక ఆమె మునగపాక పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి భర్తపై ఫిర్యాదు చేసింది. భార్యను, పిల్లలను కొట్టి, చిత్ర హింసలకు గురిచేయాలంటూ అదే గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు దుర్గాప్రసాద్‌ను ప్రేరేపిస్తున్నారని, వారిపైనా కేసు నమోదు చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. కానీ ఎస్‌ఐ కేసు నమోదు చేయలేదు. దీంతో గత నెల 28వ తేదీన కలెక్టరేట్‌కు వచ్చి పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసింది. అయినప్పటికీ మునగపాక పోలీసులు కేసు నమోదు చేయకపోవడంతో సోమవారం కలెక్టరేట్ ఎదుట బిడ్డలతో కలిసి ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుంది. బాటిల్‌లో పెట్రోల్ తీసుకువచ్చి, శరీరంపై పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ సమయంలో అక్కడ వున్న అనకాపల్లిరూరల్ సీఐ జి.అశోక్‌కుమార్, ఎస్‌ఐ రవికుమార్‌లు అడ్డుకొన్నారు.

## ఉపాధిలో శ్మశాన వాటికల అభివృద్ధి



దువ్వూరుఆగస్టు 05(టుడే విదుర):శివుడు కొలువుదీరిన చోటు శ్మశానం అనే నమ్మకం హిందువుల్లో నెలకొని ఉంది. అలాంటి శ్మశాన వాటికలు పలు గ్రామాల్లో లేకపోవడం, ఖనన కార్యక్రమాలు ఎక్కడ పడితే అక్కడ కొనసాగిస్తున్న దృశ్యాలు అరుదుగా కనపడుతున్నాయి. ఈ పరిస్థితుల్లో మైదుకూరు నియోజకవర్గంలో శ్మశాన వాటికల ఏర్పాటు ఇందుకొరకు స్థలాల సేకరణ అక్కడ సౌకర్యాలు కల్పించేందుకు మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. స్థల సేకరణ విషయంలో కొన్ని అడ్డంకులు ఎదురవుతున్నా వాటిని అధికమించే విధంగా చొరవ తీసుకుంటున్నారు. శ్మశాన వాటికల్లో ఖనన సమయంలో కాల్చే వేదికల్లో షెడ్ల ఏర్పాటు, ఆచార వ్యవహారాల నేపథ్యంలో వేచి ఉండేందుకు వేదికలు, తలనీలాల సమర్పణ సౌకర్యాలు, నీటి సౌకర్యం, స్నానపు గదులు, ఇతరత్రా వాటి కల్పనకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఒక్కొక్క శ్మశాన వాటికకు రూ.20 లక్షలు చొప్పున ఉపాధి హామీ పథకం ద్వారా నిధులు కేటాయించారు. జిల్లాలోని మైదుకూరు నియోజకవర్గం పరిధిలో దువ్వూరు, ఖాజీపేట, బ్రహ్మంగారిమఠం, మైదుకూరు, చాపాడు మండలాల్లో నిధులు కేటాయించి శ్మశాన వాటికల్లో సౌకర్యాల కల్పనకు పనులు చేస్తున్నారు.

## అనారోగ్యంతో ఆశ్రమ విద్యార్థిని మృతి



కొయ్యూరు, ఆగస్టు 05(టుడే విదుర): అనారోగ్యంతో బాధపడుతున్న రావణాపల్లి బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థిని నర్సీపట్నంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందింది. దీనికి సంబంధించి బాలిక కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మండలంలోని రావణాపల్లి బాలికల ఆశ్రమ పాఠశాలలో కినపర్తి గ్రామానికి చెందిన పొట్టిక నీలవేణి(11) ఆరవ తరగతి చదువుతోంది. గత నెల 26వ తేదీన ఆ బాలికకు జ్వరం వచ్చింది. ఈ విషయాన్ని పాఠశాల సిబ్బంది బాలిక తల్లిదండ్రులకు తెలియజేశారు. గత నెల 28న పాఠశాలకు వచ్చిన బాలిక తల్లి సత్యవతి తనతో పాటు కుమార్తెను ఇంటికి తీసుకువెళ్లిపోయింది. కృష్ణాదేవిపేటలో ఓ ప్రైవేటు వైద్యుని వద్ద చికిత్స చేయించారు. అయినా జర్వం తగ్గకపోవడంతో నర్సీపట్నంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆ బాలిక రాత్రి మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఏటీడబ్ల్యూవో క్రాంతికుమార్ వెంటనే పాఠశాల హెచ్‌ఎం మృదుభాషిణితో పాటు సిబ్బందికి సమాచారం ఇచ్చి కినపర్తి గ్రామానికి పంపించారు. బాలిక అంత్యక్రియలకు ఆర్థిక సహాయం అందించి తల్లితండ్రులను వారు ఓదార్చారు. నీలవేణి మృతితో ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# అల్లం, పసుపుపై తెగుళ్ల దాడి

**దుంప కుళ్లు ఆశించిన అల్లం మొక్క**

**దుంపకుళ్లు, ఆకుమచ్చ తెగుళ్లతో రైతులు సతమతం**

**%సకాలంలో నివారణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాస్త్రవేత్తల సూచన**



చింతపల్లి,ఆగస్టు 05(టుడే విదుర):జిల్లాలో గిరిజన రైతులు సాగుచేస్తున్న అల్లం, పసుపు పంటలో దుంపకుళ్లు, ఆకు మచ్చ (ఫిల్లోస్టిక్టా) తెగుళ్ల ఉధృతి కనిపిస్తోంది. ఈ తెగుళ్లను రైతులు సకాలంలో గుర్తించి నివారించుకోవాలని, నిర్లక్ష్యం చేస్తే మొక్కలు చనిపోయి దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతాయని స్థానిక ఉద్యాన పరిశోధన స్థానం అధిపతి, శాస్త్రవేత్త చెట్టి బిందు తెలిపారు.పాడేరు రెవెన్యూ డివిజన్ పరిధిలో పసుపు పంటను ఎనిమిది వేల హెక్టార్లు, అల్లం 586 హెక్టారుల్లో ఆదివాసీ రైతులు సాగు చేస్తున్నారు. అనధికారంగా మరో 600 హెక్టారుల్లో ఈ రెండు పంటలను సాగుచేసుకుంటున్నారు. ఏప్రిల్ నెలాఖరు నుంచి జూన్ మొదటి పక్షం వరకు రైతులు పసుపు, అల్లం నాట్లను వేసుకున్నారు. ప్రస్తుతం అల్లం, పసుపు మొక్కలు 1-1.5 ఎత్తులో ఉన్నాయన్నారు. గిరిజన ప్రాంతంలో విస్తారంగా కురిసిన వర్షాల కారణంగా అల్లం, పసుపు పంటల్లో దుంపకుళ్లు , ఆకు మచ్చ తెగులు అధికంగా వ్యాప్తి చెందుతున్నది. రైతులు ఈ తెగుళ్లను సకాలంలో గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

# నెల్లూరు జిల్లా వరికుంటపాడులో పోలీసుల దాష్టీకం





నెల్లూరు జిల్లా:ఆగస్టు 05(టుడే విదుర): వరికుంటపాడులో మైనింగ్ వ్యతిరేక ఉద్యమంలో పాల్గొన్న ఓ గ్రామస్థుడిపై పోలీసుల దురుసు ప్రవర్తన తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. మండలానికి చెందిన షేక్ పీరయ్య అనే వ్యక్తిని, విచారణ పేరుతో పోలీస్ స్టేషన్‌కి బలవంతంగా తరలించిన పోలీసుల ప్రవర్తన వల్ల, అతడు గుండెపోటుకు గురయ్యాడు. మైనింగ్ వద్దు గ్రామమే ముద్దు అనే కార్యక్రమంలో గ్రామస్తులతో కలిసి పాల్గొన్న పీరయ్య, ఇటీవల మూడు రోజులుగా ఎస్సై ఫోన్ కాల్స్ ద్వారా బెదిరింపులకు గురవుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉదయం పీరయ్య పొలంలో పని చేస్తున్న సమయంలో పోలీసులు వచ్చి అతన్ని విచారణ పేరుతో స్టేషన్‌కి తీసుకెళ్లారు. అయితే, టాబ్లెట్ కూడా వేసుకోనివ్వకుండా బలవంతంగా తీసుకెళ్లారని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. స్టేషన్‌లోకి తీసుకెళ్లిన కొద్ది సేపటికే పీరయ్య తీవ్ర అస్వస్థతకు గురై కుప్పకూలాడు. గుండెపోటుతో పడిపోవడంతో 108 అంబులెన్స్ ద్వారా తొలుత ప్రాథమిక చికిత్స, అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.పీరయ్యపై పోలీసుల వేధింపులను తీవ్రంగా ఖండించిన మైనింగ్ వ్యతిరేక జేఏసీ, ఇది ప్రజాస్వామ్యంపై తీవ్ర దాడిగా పేర్కొంది. గ్రామస్తులను ఇలా భయభ్రాంతులకు గురిచేయడం బాధాకరమని మండిపడ్డారు. ఇక ఈ ఘటన నేపథ్యంలో వరికుంటపాడు పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో స్టేషన్‌కి చేరుకొని పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# అంగన్‌వాడీల హాల్‘సెల్’



కొవ్వూరు/గోపాలపురం,ఆగస్టు 05(టుడే విదుర): అంగన్వాడీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అణచివేతకు గురిచేస్తున్నాయని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సీహెచ్.మాణిక్యాంబ అన్నారు. కొవ్వూరు,తాళ్లపూడి, గోపాలపురం ఐసీ డీఎస్ కార్యాలయాల వద్ద సోమవారం అంగ న్వాడీలు సమస్యలు పరిష్కరించాలని నిరసన ప్రదర్శన చేశారు. రాష్ట్ర సంఘం పిలుపుమేరకు సెల్‌ఫోన్లను సీడీపీవోలకు అప్పగించారు. కనీస వేతనాలు అందించే వరకు రికార్డు వర్క్ మాత్రమే చేస్తామని తెలిపారు.గత ప్రభుత్వం 2022వ సంవత్సరంలో అందించిన సెల్‌ఫోన్లు 90 శాతం పాడైపోయి నెట్‌వర్క్ అందడంలే దని పేర్కొన్నారు. యాప్‌ల భారాన్ని మోయ లేకపోతున్నామని సాంకేతిక సమస్యల కారణం గా మరిన్ని ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుం దని అంగన్‌వాడీలు వాపోతున్నారు. మొబైల్‌లో పోషణ, ట్రాకర్, సంజీవిని, విల్క్, టీఎస్ఆర్ యాప్‌లు అప్‌లోడ్ చేసే సమయంలో ఫోన్ నెట్‌వర్క్ పనిచేయక ఇబ్బంది అవుతుందన్నారు.గర్భిణుల విషయంలో నెలకు రెండు సార్లు టీఎస్ఆర్ ఇచ్చేందుకు అవకాశం ఉండడం లేదని స్కానింగ్ చేసే సమయంలో సిగ్నల్ అందక, ఎక్కువ యాప్‌ల వల్ల ఫోన్ సరిగా పనిచేయడం లేదన్నారు.గర్భిణు లకు రోజువారీ పోషకాహారం అందించే సమయంలో వారి శారీరక మార్పుల కారణంగా వారి పాత ఫొటో స్కానింగ్ అవ్వడం లేదన్నారు. ఈ యాప్‌ల అదనపు భారానికి తోడు ఫించన్ల పంపిణీ సైతం తమకే కేటాయి స్తున్నారని వాపోయారు. దీంతో చిన్నారులు, గర్భిణులు, కిశోర బాలికలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. జూలై నెలాఖరుకు కొత్త ఫోన్లు ఇస్తామన్నారు. ఆగస్టు వచ్చినా ఇవ్వకపోవడంతో పాత ఫోన్లకు సీడీపీవోకు అప్పగించామన్నారు. అంగన్వాడీలకు పనిభారం తగ్గించాలని, వేతనాలు పెంపుదల చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేత నం రూ.26 వేలు అందజేయాలన్నారు. అంగ న్వాడీ వర్కర్లకు రేషన్ కార్డులు, ప్రభుత్వ సం క్షేమ పథకాలు అందించకపోవడం అన్యాయమన్నారు.

# ఆటో బోల్తా .. ఏడుగురు విద్యార్థులకు గాయాలు



తునిరూరల్,ఆగస్టు 05(టుడే విదుర): కాకినాడ జిల్లా తుని మండలం హంసవరం గ్రామ సమీపంలో ఉదయం విద్యార్థులతో వెళ్తున్న ఆటోను ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో బోల్తా కొట్టింది. దీంతో ఏడుగురికి గాయాలయ్యాయి. రోజు మాదిరిగానే తుని మండలం మరువాడ గ్రామం నుంచి విద్యార్థులు ఆటో ఎక్కి హంసవరంలో గల ఏపీ మోడల్ స్కూల్‌కి వెళ్తుండగా కారు ఢీకొనడంతో ఆటో అదుపుతప్పి పంటపొలాల్లోకి బోల్తా కొట్టింది. ఆటోలో ప్రయాణిస్తున్న ఏడుగురు విద్యార్థులకు గాయాలు కాగా ఆటో డ్రైవర్ తీవ్ర గాయాలపాలయ్యాడు. విద్యార్థులు చెల్లాచెదురుగా పడిపోవడంతో తల, కాళ్ల కు గాయాలయ్యాయి. కేకలు వేయడంతో ఆ ప్రాంతంలోని రైతులు, పాఠశాల ఉపాధ్యాయులు హుటాహుటిన చేరుకుని విద్యార్థులను తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. గాయాలపాలైన విద్యార్థులు అప్పన రావణ్‌కుమార్, కామిరెడ్డి కృపానంద, కామిరెడ్డి సాత్విక్, కిల్లాడి నవీన్‌రాజు, రామ్‌చరణ్, ఉరుకోటి రవి, ఉరుకోటి పవన్, జి.ఈశ్వరికి వైద్యులు పరీక్షలు చేసి చికిత్స అందించారు. ఆటోను ఢీకొన్న కారు ఆగకుండా వెళ్లిపోవడంతో సీసీ ఫుటేజ్ ఆధారంగా కారును పట్టుకునే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. ప్రమాదం సమాచారం తెలుసుకున్న విద్యార్థులతల్లిదండ్రులు ఆందోళనతో ఏరియా ఆసుపత్రికి పరుగులు తీశారు. గాయాలతో ఉన్న తమ పిల్లలను చూసి కన్నీరు పెట్టుకున్నారు. ఘటనపై తుని ఎమ్మెల్యే దివ్య ఆరా తీశారు. విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలందించాలని సూచించారు.

# తల్లి, ఇద్దరు కుమార్తెల హత్య కేసు..

సామర్లకోట,ఆగస్టు 05(టుడే విదుర): కాకి నాడ జిల్లా సామర్లకోట సీతారామ దళిత కాలనీ లోని ఓ ఇంటిలో తల్లి,ఇద్దరు కుమార్తెలను దారు ణంగా హతమార్చిన వ్యక్తిని సామర్లకోట పోలీ సులు అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. శనివారం అర్ధరాత్రి ఈ హత్యోదంతం అనంతరం సామర్లకోట నుంచి సదరు అను మానితుడు పొరుగు జిల్లాకు వెళ్లిపోగా సెల్ ఫోన్ సిగ్నల్ ఆధారంగా పోలీసులు వెళ్లి మాటు వేసి పట్టుకున్నట్టు సమాచారం. ఈ హత్యలకు సామర్లకోటకు చెందిన తలే సురేష్ పాల్పడిన ట్టు పోలీసుల వద్ద పక్కా సమాచారం లభించ డంతో అతడిని అదుపులోకి తీసుకున్నారని తెలి సింది. అయితే ఈ హత్యలకు ప్రధాన కారణం వివాహేతర సంబంధమేనని పోలీసుల ప్రాథ మిక దర్యాప్తులో తేలింది. స్థానిక కోట్లమ్మచెర్వు ప్రాంతానికి చెందిన సురేష్ లారీ డ్రైవర్‌గా పని చేస్తుంటాడని, మృతురాలి ఇంటికి గత కొంత కాలంగా రాకపోకలు సాగిస్తున్నట్టు సమాచారం పోలీసులకు లభించినట్టు తెలిసింది.హత్యకు గురైన తల్లి,కుమార్తెల మృత దేహాలకు పోస్టుమార్టం చేసిన వైద్యులు విస్తు పోయినట్టు విశ్వసనీయ సమాచారం. మాధురి తలభాగం పూర్తిగా నుజ్జునుజ్జు అయ్యేలా కొట్టి నట్టు, పెద్దకుమార్తె అయిన పుష్పకుమారిని తల పైభాగం పూర్తిగా నుజ్జునుజ్జు అయ్యిందని తెలు స్తోంది. చిన్న కుమార్తె జెస్సీని తలపై కొట్టడంతో బాటు గొంతు, గుండెలపై తొక్కడంతో రిబ్స్ ఎముకలు విరిగిపోయినట్టు పోస్టుమార్టం సమ యంలో వైద్యులు గుర్తించినట్టు సమాచారం.

# మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య



భోగాపురం, ఆగస్టు 05(టుడే విదుర):మనస్తాపంతో గడ్డి మందు తాగి ఆత్మహత్య పాల్పడిన ఓ వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రాత్రి మృతిచెందాడు. ఈ ఘటనపై భోగాపురం ఎస్ఐ పాపారావు మంగళవారం తెలిపి న వివరాలు ఇలా ఉన్నాయి. రావాడ గ్రామానికి చెందిన బుగత గోవిందమ్మ, ఈశ్వరరావు(47)లు భార్యా భర్తలు. వీరికి ఇద్దరు పిల్లలు లావణ్య, అరుణకుమార్ ఉన్నారు. అయితే ఇటీవల తల్లికి వందనం పథకంలో భాగంగా గోవిందమ్మ బ్యాంకు ఖాతాలో నగదు జమ అయ్యింది. అలాగే అన్నదాత సుఖీభవ కింద ఈశ్వరరావుకు నగదు జమ అయ్యింది. ఈశ్వరరావు నిత్యం మద్యం తాగుతూ ఉంటాడు. అయితే పిల్లల స్కూల్ ఫీజు కట్టేందుకు డబ్బులు చాలవని గోవింద మ్మ.. తన భర్త ఈశ్వరరావును అన్నదాత సుఖీభవ డబ్బులు అడిగింది. దీనికి ఈశ్వరరావు ‘నా దగ్గర డబ్బులు లేవు.. నీదగ్గర ఉన్న డబ్బులు నాకు కావాలి’ అని భార్యని అడిగాడు. అలాగే ఇద్దరు పిల్లలు కూడా స్కూల్ ఫీజుకు డబ్బులు కావాలని ఈశ్వరరావును అడిగారు. దీంతో గట్టిగా కేకలు వేస్తూ ఈనెల 2వ తేదీ న ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. రాత్రి అయినా ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు గాలించడం ప్రారంభించారు. రావాడ సమీప లేఅవుట్‌లో వాంతులు చేసుకుంటూ ఉన్న ఈశ్వరరావు స్థానికులకు కనిపించాడు.

# దంచికొట్టిన వాన



ఓర్వకల్లు, ఆగస్టు 05(టుడే విదుర): మండలంలోని లొద్దిపల్లె గ్రామం లో తెల్లవారుజామున వర్షం దంచికొట్టింది. దీంతో గ్రామ నడిబొడ్డున నడివాగు వర్షం నీటితో పొంగిపొర్లడంతో బీసీ కాలనీలో ఇళ్లలోకి నీరు చేరింది. ప్రజలు పలు ఇబ్బందులు పడ్డారు. వాగు సమీ పాన ఉన్న పత్తి పొలాల్లో భారీఎత్తున వర్షం నీరు చేర డంతో రైతులు సాగు చేసిన పత్తి పంట నీటిలో మునిగిపోయింది. జాతీయ రహదారిపై నీటి ప్రవాహం అధికంగా ఉండటంతో రాకపోకలకు అంతరాయం ఏర్ప డింది. దాదాపు 3గంటల సేపు వర్షం దంచి కొట్టడంతో బీసీ కాలనీ అంతా జలమయమైంది. ఇళ్లలోకి వర్షం నీరు చేరడంతో ఇళ్లలో ఉన్న నిత్యావసర వస్తువులు తడిసిపోయాయి.

# ఆటోలో వచ్చి.. ప్రయాణికులను మభ్యపెట్టి

సాలూరు, ఆగస్టు 05(టుడే విదుర): ఆటోపై వచ్చి ప్రయాణికులను మభ్యపె ట్టి వారి వద్ద బంగారం ఎత్తుకుపోయే ఓ బ్యాచ్‌ను పట్టణ పోలీసులు పట్టుకున్నారు. పట్టణ ఎస్ఐ అనీల్‌కుమార్ కథనం మేరకు.. మెంటాడ మండలంలోని పిట్టాడ గ్రామానికి చెందిన గొర్లె రమణి, పాల లక్ష్మి, పాల వేణు, పాల శిరీష ప్రస్తుతం గొట్లాం మైసూర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. ఆదివా రం వీరు నలుగురూ తమ సొంత ఆటోపై సాలూరు వచ్చారు. పాచిపెంట మండలంలోని పి.కోనవలస గ్రామానికి చెందిన గుణాపు సుజాత ఆమె అత్త అప్పలనరసమ్మలు సాలూరు ఏరియా ఆసుపత్రి నుంచి వస్తున్నారు. ఆటో పి.కొనవలస వెళు తుందని చెప్పడంతో సుజాత, అప్పలనరసమ్మ ఎక్కారు. ఇంతలో పండ్లు కొందామని సుజాత ఆటో ఆపి దిగింది. దీంతో వెంటనే అప్పలనరసమ్మ మెడలో ఉన్న బంగారం గొలుసు లాక్కొన్నారు. కొంత దూరం వెళ్లిన తర్వాత ఆమెను దించేసి ఆటోపై ఆ నలుగురు వెళ్లిపోయారు. దీంతో సుజాత పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసింది. పట్టణ సీఐ అప్పలనాయుడు మూడు బృందాలను ఏర్పాటుచేసి గాలింపు చర్యలు చేపట్టారు. సాలూరు బైపాస్ రోడ్డులో నెలిపర్తి సమీపం వద్ద సోమవారం ఆటోలో వెళ్తున్న నలుగురిని గుర్తించి పట్టుకున్నారు. వారి వద్ద నుంచి బంగారం గొలుసును స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై గతంలో అనేక కేసులు నమోదయ్యాయి. కాగా కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.

# చైల్డ్ పోర్న్ వీక్షణ..
# పాల్వంచలో ఇద్దరిపై కేసు



పాల్వంచఆగస్టు 05(టుడే విదుర): ఆన్‌లైన్‌లో చైల్డ్ పోర్నోగ్రఫీ వీడియోలు చూసిన ఇద్దరిపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. కేంద్ర ప్రభుత్వానికి చెందిన సైబర్ క్రైమ్ విభాగం ఆన్‌లైన్ కార్యకలాపాలపై నిఘా పెట్టింది. ఈ నేపథ్యంలో పాల్వంచకు చెందిన ఇద్దరు వ్యక్తులు ఓ యాప్‌లో తరచూ చైల్డ్ పోర్న్ వీడియోలు చూస్తున్నారని గుర్తించింది. చట్ట ప్రకారం ఇది నేరం కావడంతో, విషయాన్ని పాల్వంచ పోలీసులకు తెలియజేసింది. దీంతో అప్రమత్తమైన పోలీసులు ఆ ఇద్దరినీ గుర్తించి వారిపై కేసు నమోదు చేశారు.

ఇంజనీరింగ్, కౌన్సెలింగ్ సీట్ల తారుమారుపై రాష్ట్ర ప్రభుత్వం విచారణ చేపట్టాలని తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ డిమాండ్ చేశారు. బాలికల సీట్లను బాలురకు కేటాయించడం అత్యంత దుర్మార్గమని ఆయన పేర్కొన్నారు. ఇంజనీరింగ్ కళాశాలల ఫీజుల విత్‌డ్రా తేదీని ఈ నెల 23 వరకు పొడిగించాలని కోరారు. కాచిగూడలో రామకృష్ణ విలేకరులతో మాట్లాడారు. ఓపెన్ బాలికల కోటాలో బాలురకు అక్రమంగా కేటాయించిన ఇంజనీరింగ్ సీట్లను తక్షణమే రద్దు చేసి మెరిట్ ప్రకారం అర్హులైన విద్యార్థినులకు తిరిగి కేటాయించాలని, తప్పిదానికి కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం విడుదల చేయాలని రామకృష్ణ కోరారు.

# గ్యాంగ్‌రేప్ కేసులో యువకుడికి 25 ఏళ్ల జైలు

హైదరాబాద్:ఆగస్టు 05(టుడే విదుర): బాలికపై గ్యాంగ్‌రేప్ కేసులో ఓ యువకుడికి 25 సంవత్సరాల జైలుశిక్ష విధిస్తూ నాంపల్లి కోర్టు తీర్పు చెప్పింది. చిలకలగూడ ఇన్‌స్పెక్టర్ అనుదీప్ వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ నామాలగుండుకు చెందిన కమలాకర శివకుమార్ అలియాస్ శివ(19) ప్రైవేట్ ఉద్యోగి. అదే ప్రాంతానికి చెందిన ఓ బాలికతో పరిచయం పెంచుకున్నాడు. 2021 జనవరిలో ఇంటిలో ఎవరూ లేని సమయంలో మరో ముగ్గురు స్నేహితులతో కలిసి బాలికను తన గదికి తీసుకువెళ్లి బెదిరించి గ్యాంప్ రేప్‌కు పాల్పడ్డారు. ఆ సమయంలో వీడియోలు, ఫొటోలు తీసి, ఎవరికైనా చెపితే వీటిని ఇంటర్నెట్‌లో అప్‌లోడ్ చేస్తామని



బెదిరించారు. అనారోగ్యం బారిన బాలికకు కుటుంబసభ్యులు వైద్యం చేయించిన తర్వాత ఆరా తీయగా తనపై నలుగురు యువకులు అత్యాచారం చేశారని తెలిపింది. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోక్సో, ఐటీ చట్టాల ప్రకారం కేసును నమోదు చేసిన పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. నాలుగు సంవత్సరాలు కోర్టు లో కేసు నడిచిన తర్వాత వాదోపవాదాలు విన్న నాంపల్లి 12వ అదనపు జడ్జి అనిత తీర్పునిచ్చారు. బాలికపై గ్యాంగ్‌రేప్ జరిగినట్లు నేరం రుజువు కావటంతో ప్రధాన నిందితుడు కమలాకర శివకుమార్ కు పోక్సో చట్టం కింద 25 ఏళ్ల జైలుశిక్ష, ఐదువేల రూపాయల జరిమానా, జరిమానా చెల్లించకుంటే మరో ఆరునెలల జైలుశిక్ష, ఐటీ చట్టం ప్రకారం రెండేళ్ల జైలుశిక్ష, ఐదువేల జరిమానా, జరిమా నా చెల్లించకుం టే మరో మూడునెలల సాధారణ జైలుశిక్ష విధిస్తూ తీర్పును వెల్లడించారు. కోర్టు ఆదేశాల మేరకు శివ కుమార్‌ను సోమవారం చంచల్‌గూడ జైలు కు తరలించారు.

# జీహెచ్‌ఎంసీలో జనరేటివ్-ఏఐ..




హైదరాబాద్ సిటీ:ఆగస్టు 05(టుడే విదుర): పారదర్శక సేవలు, పౌర సమస్యల పరిష్కారం, పాలనా వ్యవహారాల్లో సంస్కరణలకు అధునాతన సాంకేతికతను వినియోగించాలని జీహెచ్‌ఎంసీ నిర్ణయించింది. పౌర సేవలు మొదలు ఘన వ్యర్థాల నిర్వహణ, స్మార్ట్ పార్కింగ్, బస్సుల రియల్ టైం ట్రాకింగ్, రోడ్ సేఫ్టీ, ట్రాఫిక్ మోడల్స్, ప్రాజెక్టు టెండర్ మూల్యాంకనం, కీటక జనిత వ్యాధుల నివారణ, నిర్మాణరంగ వ్యర్థాల అక్రమ డంపింగ్ నియంత్రణను సాంకేతిక పరిజ్ఞానంతో చేపట్టాలని భావిస్తోంది. %ఇందుకోసం కృత్రిమ మేధ(ఏఐ) కంటే అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ జనరేటివ్ ఏఐని వినియోగించాలని నిర్ణయించారు. గూగుల్ భాగస్వామ్యంతో త్వరలో ఏదైనా సర్కిల్‌లో జనరేటివ్ ఏఐ ఆధారిత పైలెట్ ప్రాజెక్టును చేపట్టనున్నారు. ఇది విజయవంతమైతే గ్రేటర్ వ్యాప్తంగా విస్తరించనున్నట్టు సంస్థ పేర్కొంది. పురపాలకశాఖ కార్యదర్శి ఇలంబరిది, %జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, ఇతర అధికారులు గూగుల్ మీట్ ద్వారా గూగుల్ క్లౌడ్ ప్లాట్‌ఫామ్ బృందంతో ప్రాజెక్టు అమలు సాధ్యాసాధ్యాలపై చర్చించారు. హైదరాబాద్‌ను జనరేటివ్ ఏఐ నగరంగా తీర్చిదిద్దాలని సీఎం రేవంత్‌రెడ్ల భావిస్తోన్న నేపథ్యంలో బల్దియాలో చేపట్టనున్న ఈ ప్రాజెక్టు ముందడుగు కానుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. గూగుల్ భాగస్వామ్య ప్రాజెక్టు జీహెచ్‌ఎంసీ డిజిటల్ పరివర్తన ప్రయాణంలో మైలురాయిగా నిలవనుందని ఇలంబరిది, కర్ణన్ తెలిపారు. ఇది పౌరులందరికీ స్మార్ట్, ఆరోగ్యకరమైన, ఫ్రెండ్లీ హైదరాబాద్‌ను నిర్మించే దిశగా కీలక పరిణామమని అన్నారు.

# మేడ్చల్‌లో పేలిన గ్యాస్ సిలిండర్

మేడ్చల్ టౌన్,ఆగస్టు 05(టుడే విదుర): మేడ్చల్ పట్టణంలోని మార్కెట్ రోడ్డులో ఓ ఇంట్లో వంట గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో ఒకరు మృతి చెందగా, ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. పేలుడు ధాటికి ఇల్లు పూర్తిగా ధ్వంసమైంది. పేలుడు సమయంలో ఇంటి ముందు రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న యువకుడికి శకలాలు బలంగా తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పేలుడు సమయంలో ఇంట్లో ఉన్న ముగ్గురికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. షార్ట్ సర్క్యూట్ వల్ల పేలుడు



జరిగిందా, లేక గ్యాస్ లీకేజీ వల్ల జరిగిందా అనేది పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతి చెందిన యువకుడి వివరాలు కూడా తెలియరాలేదు.

# యూరియా కోసం పడిగాపులు

రుద్రంగి/ కోరుట్లరూరల్/ ముస్తాబాద్, ఆగస్టు 05(టుడే విదుర):ఒకవైపు ఆలస్యమైన వర్షాలతో ఆందోళన చెందుతున్న రైతులు.. మరోవైపు యూరియా బస్తాలు అందక నానా తంటాలు పడుతున్నారు. సహకార సంఘాల్లో రైతులకు సరిపోయేన్ని బస్తాలు ఇవ్వకపోవడంతో సాగు పనులను వదులుకొని సొసైటీ గోదాంల ఎదుట ఉదయం నుంచి పడిగాపులు గాస్తున్నారు. ఒకరికి ఒకటే బస్తా ఇవ్వడం.. కొన్నిచోట్ల ఎకరాకు ఒక్క బస్తా చొప్పున అందించడం.

%మరికొన్ని చోట్ల పోలీసుల పహారా మధ్య పంపిణీ చేయడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రుద్రంగి సహకార సంఘం ఆధ్వర్యంలో యూరియా బస్తాలు ఇవ్వడంతో రైతులు వ్యవసాయ పనులను వదులుకొని సొసైటీ గోదాం ఎదుట బారులు తీరారు. తమ ఆధార్ కార్డులు వరుసలో పెట్టి యూరియా బస్తాల కోసం పడిగాపులు కాశారు. తీరా




ఒక్కరికి ఒక ఆధార్ కార్డుపై ఒకటే ఇవ్వడంతో ఆగ్రహించారు. ఆ ఒక్కటి కూడా దొరుకుతుందో లేదో అని ఎగబడ్డారు. చాలా మంది గంటల తరబడి నిరీక్షించి యూరియా అందక నిరాశతో వెనుదిరిగారు. ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యంతో సరిపడా యూరియా అందడం లేదని మండిపడ్డారు. కోరుట్ల మండలంలోని ఐలాపూర్‌లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో యూరియాను పోలీసు పహారా మధ్య పంపిణీ చేశారు. సహకార సంఘానికి 450 బస్తాలు రాగా ఎలాంటి గొడవలు జరుగకుండా ముందస్తుగా పోలీసు పహారా ఏర్పాటు చేశారు. రైతులు ఆధార్‌కార్డు, పట్టాపాస్ బుక్ జిరాక్సుతో వ్యవసాయ విస్తీర్ణ అధికారులకు అందించగా, ఆన్‌లైన్‌లో నమోదు చేసుకొని ఎకరానికి ఒక బస్తా చొప్పున సుమారు 80 మంది రైతులకు అందజేశారు.

# ఇల్లెందులో 45 కిలోల గంజాయి పట్టివేత




ఇల్లెందు, ఆగస్టు 05(టుడే విదుర): అక్రమంగా గంజాయిని తరలిస్తున్న ముగ్గురిని ఇల్లెందు పోలీసులు పట్టుకున్నారు. వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో కొత్తగూడెం వైపు నుంచి ఇల్లెందు వెళ్తున్న మారుతి యూవీ 300 కారులో వారు గంజాయి తరలిస్తున్నట్లు గుర్తించారు. దీంతో వారిని అరెస్టు చేసి, కారు, మూడు సెల్‌ఫోన్లను సీజ్ చేశారు. %నిందితులను మహబూబాబాద్ జిల్లా మరిపెడకు చెందిన తేజావత్ శంకర్, తేజావత్ జంకు, సూర్యాపేట జిల్లాకు చెందని ఆంగోతు సంతులుగా పోలీసులు గుర్తించారు. ఒడిశాకు చెందిన రాము తాతారావు వద్ద గంజాయిని తీసుకుని మహారాష్ట్రలోని హరిబాబుకు అప్పగించేందుకు వెళ్తున్నట్లుగా విచారణలో తెలుసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.22.68 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

# వివాదాస్పదంగా ఇద్దరు
# కానిస్టేబుళ్ల వ్యవహారం..

నల్లగొండ జిల్లా ఆగస్టు 05(టుడే విదుర): తిప్పర్తిలో ఇద్దరు కానిస్టేబుళ్ల వ్యవహారం వివాదాస్పదంగా మారింది. సరైన పత్రాలు లేని, గంజాయి కేసుల్లో వదిలి వెళ్లిన బైకును వారిద్దరూ అమ్మినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా డబ్బు కోసం బైక్ కొనుగోలు చేసిన వ్యక్తిని తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. వివరాల్లోకి వెళితే..ఒక వ్యక్తి ఇటీవల పోలీసుల వద్ద నుండి ఒక బైక్‌ను కొనుగోలు చేశాడు. అయితే, అతడు మొత్తం డబ్బు చెల్లించకముందే కానిస్టేబుళ్లు బైక్‌ను అప్పగించినట్లు తెలుస్తోంది. కానీ, తర్వాత.. ఇవాల్సిన సగం డబ్బు కోసం ఇద్దరు కానిస్టేబుళ్లు తీవ్ర ఒత్తిడి తెచ్చారని బాధితుడు ఆరోపిస్తున్నాడు. పైగా, బైక్‌కు సంబంధించి ఎటువంటి అధికారిక పత్రాలు అందించలేదని అతను పేర్కొన్నాడు. ఈ విషయమై బాధితుడు తిప్పర్తి పోలీస్ స్టేషన్‌లో అధికారికంగా ఫిర్యాదు చేయగా, అసలు విషయం బయటపడింది. ఫిర్యాదులో, బైక్‌కు సంబంధించి పత్రాలు లేకపోవడమే కాకుండా, ఒత్తిడితో వేదింపులకు గురయ్యానని బాధితుడు తెలిపాడు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు స్పందించి, ఇద్దరు కానిస్టేబుళ్ల తీరుపై అంతర్గత విచారణ ప్రారంభించినట్టు తెలుస్తోంది. అయితే, విచారణ పూర్తయ్యే వరకు, సంబంధిత అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకునే అవకాశం ఉందని వార్తలు వినిపిస్తున్నాయి.

# 30 మంది విద్యార్థినులకు అస్వస్థత



**ఖమ్మం జిల్లా కల్లూరు గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో ఘటన**
**ఉదయం కిచిడీ తిన్న గంట వ్యవధిలోనే విద్యార్థినులకు వాంతులు**
**పాఠశాలకు వెళ్లిన వెంటనే ఒక్కరొక్కరుగా సొమ్మసిల్లిన బాలికలు**
**సీహెచ్‌సీకి తరలించి చికిత్స చేయించిన పాఠశాల ఉపాధ్యాయులు**


పెనుబల్లి (కల్లూరు),ఆగస్టు 05(టుడే విదుర): ఖమ్మం జిల్లా కల్లూరులోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలకు చెందిన 30 విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. ఆశ్రమ వసతి గృహంలో ఉదయం అల్పాహారంగా కిచిడీ తిన్న గంట వ్యవధిలోనే ఈ ఘటన చోటుచేసుకుంది. విద్యార్థినుల కథనం ప్రకారం.. కల్లూరులోని గిరిజన బాలికల పాఠశాల వసతి గృహంలో ఆరు నుంచి పది తరగతుల వరకూ చదువుతున్న విద్యార్థినులు మొత్తం 96 మంది ఉన్నారు. వారిలో సోమవారం 86 మంది విద్యార్థినులు హాజరయ్యారు. %వీరికి హాస్టల్ బాధ్యులు ఉదయం అల్పాహారంగా కిచిడీ వండారు. రోజూలాగే ఉదయం కూడా ఆ కిచిడీని అల్పాహారంగా తిన్న విద్యార్థినులు ఆ తరువాత పాఠశాలకు వెళ్లిపోయారు. అలా వెళ్లిన గంట వ్యవధిలోనే వారిలో సుమారు 30 మంది విద్యార్థినులు పాఠశాలలో అస్వస్థతకు గురయ్యారు. ఒక్కరొక్కరుగా సొమ్మసిల్లి పడిపోయారు. వెంటనే అప్రమత్తమైన పాఠశాల ఉపాధ్యాయులు వారిని స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)కి తరలించారు. వైద్యులు వారికి చికిత్స అందించారు. విద్యార్థినుల అస్వస్థత గురించి తెలుసుకున్న కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్‌యాదవ్, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి వెంటనే సదరు వైద్యశాలకు చేరుకొని విద్యార్థినుల అస్వస్థత గురించి అడిగి తెలుసుకున్నారు. స్వయంగా వైద్యురాలైన ఎమ్మెల్యే రాగమయి విద్యార్థినులను ఆరోగ్య పరిస్థితి పరీక్షించారు.

# టుడే వినోదం

## షెడ్యూల్ పూర్తి...




పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ దర్శకుడు హరీశ్ శంకర్ కాంబినేషన్ లో రూపుదిద్దుకుంటున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' మూవీ తాజా షెడ్యూల్ పూర్తయ్యింది. ఆగస్ట్ 4 నుండి సినీ కార్మికులు సమ్మె మొదలు పెట్టిన నేపథ్యంలో సోమవారం 'ఉస్తాద్ భగత్ సింగ్' షూటింగ్ కు అంతరాయం ఏర్పడింది. ఈ సినిమా పాట చిత్రీకరణ కోసం డాన్సర్స్ తో ప్రాక్టీస్ చేస్తున్న సమయంలో సినీ కార్మికులు షూటింగ్ ను అడ్డుకోవడానికి ప్రయత్నించారు. వారితో మూవీ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ చెర్రీ వాగ్వివాదానికి దిగారు. పరిస్థితులు చేజారిపోతున్న సమయంలో మొత్తానికి సర్దుబాటు జరిగింది. నిర్మాతగా తమకు నచ్చిన వారితో షూటింగ్ చేసుకుంటామని చెర్రీ చెప్పిన దానికి ఫెడరేషన్ నాయకులు అంగీకరించలేదు. ఇది జరిగిన కొద్ది గంటలలోనే తెలుగు ఫిల్మ్ ఛాంబర్ నుండి ఇదే అంశాన్ని ప్రస్తావిస్తూ ఓ లేఖ విడుదలైంది. ఏ నిర్మాత అయినా తమకు నచ్చిన వారితో పని చేసుకోవచ్చునంటూ ఆ లేఖలో పేర్కొన్నారు. ఇదిలా ఉంటే... సోమవారం రాత్రి తమ సినిమా తాజా షెడ్యూల్ పూర్తి అయినట్టుగా దర్శకుడు హరీశ్ శంకర్ ఎక్స్ లో ఓ పోస్ట్ పెట్టారు. మూవీ సెట్ లో పవన్ కళ్యాణ్ తో దిగిన ఫోటోను పెడుతూ, 'మాటిస్తే నిలబెట్టుకోవడం, మాట మీదే నిలబడ్డం... మీరు పక్కనుంటే కరెంటు పాకినట్టే' అంటూ ఆ పోస్ట్ లో హరీశ్ శంకర్ పేర్కొన్నాడు.



## సింగర్ ను డిన్నర్ కు పిలుస్తానంటున్న రశ్మిక...




యువ నటుడు రాహుల్ రవీంద్రన్ 'అందాల రాక్షసి'తో తెలుగు సినిమా రంగంలోకి అడుగుపెట్టాడు. ఆ తర్వాత కొన్ని సినిమాల్లో నటించినా... ఏడేళ్ళ క్రితం 'చి.ల.సౌ'తో తొలిసారి మెగాఫోన్ పట్టుకున్నాడు. ఆ తర్వాత నాగార్జున్ హీరోగా 'మన్మథుడు 2' మూవీని తెరెక్కించాడు. మొదటి సినిమా చక్కని విజయాన్ని అందుకున్నా... రెండో సినిమా నిరాశకు గురిచేసింది. అయితే ఇప్పుడు మరోసారి అతను 'ది గర్ల్ ఫ్రెండ్' మూవీని డైరెక్ట్ చేస్తున్నాడు. నేషనల్ క్రష్ రశ్మిక మందణ్ణ టైటిల్ రోల్ పోషిస్తున్న ఈ సినిమా ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ ను పూర్తి చేసుకుంటోంది. ఇటీవలే ఈ సినిమాను ఫస్ట్ సింగిల్ విడుదలై చక్కని ఆదరణ పొందింది. తాజాగా రెండో పాటను రికార్డ్ చేశారు.%ఈ సందర్భంగా రాహుల్ రవీంద్రన్ పెట్టిన ఓచిలిపి పోస్ట్ కు చిత్ర కథానాయిక రశ్మిక మందణ్ణ తన దైన స్టైల్ లో రిప్లయ్ ఇచ్చింది. ఈ పాట రికార్డ్ కు సంబంధించిన చిన్నపాటి వీడియోను రాహుల్ సోమవారం ఎక్స్ లో పోస్ట్ చేశాడు. ఈ సెకండ్ సింగిల్ ను రాహుల్ రవీంద్రన్ భార్య, ప్రముఖ గాయనీ, డబ్బింగ్ ఆర్టిస్ట్ చిన్మయి గానం చేసింది. ఆవిడ కనీకనిపించకుండా ఉన్న ఈ వీడియోను పోస్ట్ చేస్తూ... రాహుల్ రవీంద్రన్... 'ఈ సింగర్ ఈ సెకండ్ సింగిల్ ను అద్భుతంగా పాడింది.

## సడన్‌గా ఓటీటీకి వచ్చి షాకిచ్చిన హాలీవుడ్ బ్లాక్‌బస్టర్! కానీ వారికి మాత్రమే




ఓటీటీ ప్రియులను అలరించేందుకు సడన్‌గా లేటెస్ట్ హాలీవుడ్ బ్లాక్ బస్టర్ మూవీ జురాసిక్ వరల్డ్ రీబర్త్ డిజిటల్ స్ట్రీమింగ్‌కు వచ్చేసింది. ఇప్పటికే ఈ జురాసిక్ పార్క్ సినిమాల ఫ్రాంచైజీలో ఏడవ చిత్రంగా, 2022లో వచ్చిన జురాసిక్ వరల్డ్ డొమినియన్ ఘటనల అనంతరం ఐదు సంవత్సరాలకు జరిగిన కథ నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కింది. సుమారు 220 మిలియన్ డాలర్లకు పైగా ఖర్చుతో రూపొందిన ఈ చిత్రం జూలై 2న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలోకి వచ్చింది. ఆపై సినిమా నెగిటివ్ టాక్ తెచ్చుకున్నప్పటికీ సంచలన కలెక్షన్స్ వసూలు చేసింది. 800 మిలియన్ డాలర్లను సంపాదించి రికార్డ్ సృష్టించింది.%నగర జీవనానికి దూరంగా ఓ ఐలాండ్‌లో ఉన్న డ్రాగన్స్ డీఎన్ఎతో ఖరీదైన, అత్యవసరమైన మందు తయారు చేయవచ్చని ఓ బిలియనీర్ ఓ హై సెక్యూరిటీ టీమ్‌ను ఏర్పాటు చేసుకుని ఆ ఐలాండ్‌కు వెళతాడు. అక్కడ మూడు గుడ్ల నుంచి డీఎన్ఏ తీసుకెళ్లే ప్రయత్నం చేస్తాడు. ఈ క్రమంలో తనతో పాటు వచ్చిన ఆఫీసర్ చేసిన పని వల్ల సీన్ అంతా మారి డైనోసార్లు వేట మొదలు పెడతాయి. దీంతో ఆ టీమ్ అక్కడి నుంచి ఎలా బయట పడింది, ఏ విధంగా పోరాట్ చేయాల్సి వచ్చిందనే పాయింట్‌తో సినిమా సాగుతుంది.

## సోనూసూద్, మానస అతిథులుగా...




భారతదేశంలో అమెరికా ప్రమాణాలకు అనుగుణంగా నాణ్యమైన హెల్త్ సప్లిమెంట్లను అందించాలనే లక్ష్యంతో 'ఆల్ఫాలీట్' బ్రాండ్ మార్కెట్లోకి అడుగుపెట్టింది. హైదరాబాద్ లో జరిగిన ఈ గ్రాండ్ లాంచ్ వేడుకలో 'ఇండియన్ రియల్ హీరో' సోనూ సూద్ ముఖ్య అతిథిగా పాల్గొని, 'ఆల్ఫాలీట్' బ్రాండ్‌ను ఆవిష్కరించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి సోనూసూద్ తో పాటు మిస్ ఇండియా మానస ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. 'అథెంటిక్, ఎక్స్ క్లూజివ్, పెర్ఫార్మెన్స్' అనే నినాదంతో ప్రజల ముందుకు వచ్చిన ఆల్ఫాలీట్, ఆరోగ్యాన్ని ప్రోత్సహించే అత్యుత్తమ సప్లిమెంట్లను అందించడమే తమ లక్ష్యమని స్పష్టం చేసింది.%ఈ సందర్భంగా సోనూసూద్ మాట్లాడుతూ, 'ఆల్ఫాలీట్ వంటి ఒక అద్భుతమైన బ్రాండ్‌ను హైదరాబాద్‌లో ప్రారంభించడం చాలా సంతోషంగా ఉంది.

## విడాకులు కన్ఫర్మ్........ పెళ్లి ఫొటోలు డిలీట్ చేసిన హన్సిక




ఇండస్ట్రీలో ఈ ప్రేమలు, పెళ్లిళ్లు ఎవరెవరు ఎప్పుడు చేసుకుంటున్నారు.. అసలు ఎందుకు విడిపోతున్నారు అనేది ఎవరికీ అంతుచిక్కడం లేదు. సీనియర్, జూనియర్ అనే తేడా లేకుండా విడాకులు తీసుకోవడం ఫ్యాషన్ గా మారిపోయింది. 20 ఏళ్లు కలిసి ఉన్న సెలబ్రిటీలు విడాకులు తీసుకొని విడిపోతున్నారు.. ఎన్నో ఆశలతో ప్రేమించి పెళ్లి చేసుకొని మూడేళ్లు కూడా కలిసి లేకుండా విడాకులు తీసుకొని విడిపోతున్నారు. తాజాగా బబ్లీ బ్యూటీ హన్సిక మోత్వానీ సైతం తన భర్తకు విడాకులు ఇవ్వడానికి సిద్ధమైనట్లు తెలుస్తోంది.%అందాల భామ హన్సిక బాలనటిగా కెరీర్ ను మొదలుపెట్టి.. తెలుగులో దేశముదురు సినిమాతో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చి కుర్ర హీరోల సరసన నటించి మెప్పించింది. కెరీర్ పీక్స్ లో ఉన్నప్పుడే హన్సిక.. తన ఫ్రెండ్ భర్త అయిన సోహైల్ కతూరియాను వివాహమాడింది. 2022 లో వీరి వివాహం అంగరంగ వైభవంగా జరిగింది. అంతేకాకుండా వీరి పెళ్లి డాక్యుమెంటరీ హన్సికస్ లవ్ షాదీ డ్రామా పేరుతో జియో హాట్ స్టార్ లో స్ట్రీమింగ్ కూడా అయ్యింది.

## నేను.. ఎదగకుండా ఆపే ప్రయత్నం చేశారు




లతాను పడిలేచిన కెరటంలా మరింత ఉత్సాహంతో ముందుకు సాగుతున్నానని, కార్ రేసింగ్‌లో మన దేశం గర్వపడేలా చేస్తానని అగ్ర నటుడు అజిత్ కుమార్ ( పేర్కొన్నారు. ఆయన చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టి 33 యేళ్ళు పూర్తి చేసుకున్న శుభసందర్భంలో ఒక ఎమోషనల్ పోస్ట్ చేశారు. 'జీవితంలో ఎన్నో మానసిక ఒత్తిడిలు, ఎదురు దెబ్బలు, వైఫల్యాలు నిరంతరం పరీక్షించాయి. వాటన్నింటినీ ఎదుర్కొంటూనే ముందుకు సాగాను. అన్నింటినీ భరించి పడిలేచిన కెరటంలా మరింత ఉత్సాహంతో ముందుకు వెళుతున్నాను. సినిమాల్లో వరుస పరాజయాలు ఎదురై.. ఇక విజయం ఊహించలేనని అనుకున్న ప్రతిసారి అభిమానుల ప్రేమే నన్ను ప్రోత్సహించింది.

# గంభీర్ కళ్లలో నీళ్లు.. మ్యాచ్ అనంతరం గంభీర్ ఎంత ఎమోషనల్ అయ్యాడో చూడండి..



టీమిండియా టీ-20 ప్రపంచకప్ గెలిచిన తర్వాత గౌతమ్ గంభీర్ హెడ్ కోచ్ బాధ్యతలు స్వీకరించాడు. అప్పటికే ఛాంపియన్‌గా నిలిచిన టీమిండియాను గంభీర్ మరింత ఉన్నత స్థితికి తీసుకెళ్లాడని అందరూ భావించారు. అతడు కోరినవన్నీ ఇవ్వడానికి బీసీసీఐ అంగీకరించింది. అయితే ఆ తర్వాత టీమిండియా ఆటతీరు తీవ్ర విమర్శలపాలైంది. ఆస్ట్రేలియాతో టెస్ట్ సిరీస్ ఓటమిపాలైంది. స్వదేశంలో న్యూజిలాండ్ చేతిలో వైట్‌వాష్‌కు గురైంది. శ్రీలంకతో వన్డే సిరీస్ కోల్పోయింది.టీమిండియా పేలవ ప్రదర్శన కారణంగా గంభీర్ పలు విమర్శలు ఎదుర్కొన్నాడు. ఈ నేపథ్యంలో ఇంగ్లండ్‌తో ఐదు టెస్ట్‌ల సిరీస్ మొదలైంది కుర్రాళ్లతో కూడిన టీమిండియా.. ఇంగ్లండ్‌లో పెద్దగా సాధించేది ఏమీ ఉండదని అందరూ అనుకున్నారు. అనుకున్నట్టుగానే తొలి టెస్ట్‌లో టీమిండియా పరాజయం పాలైంది. అయితే రెండో టెస్ట్ మ్యాచ్‌లో అనూహ్యంగా పుంజుకుని భారీ విజయం సాధించింది. ఇక, మూడో టెస్ట్‌లో చివరి వరకు పోరాడి 21 పరుగుల తేడాతో ఓడిపోయింది. ఓటమి తప్పదనుకున్న నాలుగో టెస్ట్‌ను డ్రా చేసుకుంది. ఇక, ఐదో టెస్ట్ కూడా చేజారినట్టే అనుకున్న తరుణంలో థ్రిల్లింగ్ విక్టరీ సాధించింది.ఓవల్‌లో ఐదో టెస్ట్ మ్యాచ్ విజయం అనంతరం హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ చిన్న పిల్లాడిలా సంబరాలు చేసుకున్నాడు. కన్నీళ్లు పెట్టుకున్నాడు. సహచరులను హత్తుకుని ఎమోషనల్ అయ్యాడు. నిజానికి గంభీర్ ఎలాంటి భావోద్వేగాలనూ ప్రదర్శించాడు. అయితే ఈ సిరీస్ ఓడిపోతే భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతోందనే వార్తలు వస్తున్న నేపథ్యంలో గంభీర్ ఎమోషనల్ అయ్యాడు. ఆ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

# నిస్సందేహంగా ఇది అద్భుత విజయమే.




. 374 పరుగుల ఛేదనలో ఇంగ్లండ్ స్కోరు ఓ దశలో 301/3. క్రీజులో ఉన్న హ్యారీ బ్రూక్ ధనాధన్ ఆటతో బెంబేలెత్తిస్తున్నాడు.. మరో ఎండ్‌లో నిలకడకు మారుపేరు జో రూట్ ఉన్నాడు. ఈ పరిస్థితుల్లో ఎవరైనా ఊహిస్తారా.. మ్యాచ్‌లో భారత్ గెలుస్తుందని? కానీ అదే జరిగింది. నాలుగో రోజు ఆఖరి సెషన్‌లో టపటపా వికెట్లు తీసి మన పేసర్లు విజయంపై ఆశలు రేపారు. ఇక సోమవారం ఇంగ్లండ్‌కు 35 రన్స్, భారత్‌కు 4 వికెట్లు అవసరమవగా.. మ్యాచ్ ఏ వైపునకో అనే ఉత్కంఠ అందరిలోనూ నెలకొంది. ఓ దశలో ఇంగ్లండ్ వైపే మొగ్గు కనిపించినా.. మహ్మద్ సిరాజ్ గేమ్ చేంజర్‌గా మారాడు. పాత బంతితోనే సూపర్ స్వింగ్‌ను రాబడుతూ.. బుల్లెట్‌లాంటి యార్కర్లతో వికెట్లు తీసి ఇంగ్లండ్ పతనాన్ని శాసించాడు. అంతే.. చేయి దాటిందనుకున్న మ్యాచ్ భారత్ ఖాతాలో చేరింది. సిరీస్ 2-2తో సమమైంది.లండన్: భారత్-ఇంగ్లండ్ జట్ల మధ్య జరిగిన ఐదు టెస్టుల సిరీస్‌కు అదిరే ముగింపు. సిరీస్ కోసం ఆతిథ్య జట్టు.. సమం కోసం గిల్ సేన నువ్వా నేనా అనే రీతిలో తలపడిన ఐదో టెస్టులో సోమవారం అద్భుతమే జరిగింది. 374 పరుగుల ఛేదనలో మరో 35 పరుగుల కోసం చివరి రోజు బరిలోకి దిగిన ఇంగ్లండ్‌కు పేసర్ సిరాజ్ (5/104) దిమ్మతిరిగేలా చేశాడు. ప్రసిద్ధ్ (4/126) కూడా రాణించడంతో ఆ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 85.1 ఓవర్లలో 367 పరుగులకు ఆలౌటైంది. అటు ఆరు పరుగుల తేడాతో గట్టెక్కిన భారత్.. అండర్సన్-టెండూల్కర్ ట్రోఫీని 2-2తో సమం చేసింది. అట్కిన్సన్ (17) పోరాటం ఇంగ్లండ్‌కు ఫలితాన్నివ్వలేదు. అంతకుముందు భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 224, ఇంగ్లండ్ 247 పరుగులు చేయగా.. భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 396 రన్స్ చేసింది. ఈ టెస్టులో 9 వికెట్లు తీసిన సిరాజ్ ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా.. గిల్, బ్రూక్ 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'గా నిలిచారు.భారత్ తొలి ఇన్నింగ్స్: 224బీ ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 247బీ భారత్ రెండో ఇన్నింగ్స్: 396బీ ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్: క్రాలే (బి) సిరాజ్ 14, డకెట్ (సి) రాహుల్ (బి) ప్రసిద్ధ్ 54, పోప్ (ఎల్బీ) సిరాజ్ 27, రూట్ (సి) జురెల్ (బి) ప్రసిద్ధ్ 105, బ్రూక్ (సి) సిరాజ్ (బి) ఆకాశ్ 111, బెథెల్ (బి) ప్రసిద్ధ్ 5, స్మిత్ (సి) జురెల్ (బి) సిరాజ్ 2, ఒవర్టన్ (ఎల్బీ) సిరాజ్ 9, అట్కిన్సన్ (బి) సిరాజ్ 17బీ టంగ్ (బి) ప్రసిద్ధ్ 0బీ వోక్స్ (నాటౌట్) 0బీ ఎక్స్‌ట్రాలు: 23బీ మొత్తం: 85.1 ఓవర్లలో 367 ఆలౌట్‌బీ వికెట్ల పతనం: 1-50, 2-82, 3-106, 4-301, 5-332, 6-337, 7-347, 8-354, 9-357, 10-367. బౌలింగ్: ఆకాశ్ దీప్ 20-4-85-1, ప్రసిద్ధ్ కృష్ణ 27-3-126-4, సిరాజ్ 30.1-6-104-5, సుందర్ 4-0-19-0, జడేజా 4-0-22-0.

# టుడే స్పోర్ట్స్

# సుయ్ సెలబ్రేషన్స్



ఇంగ్లండ్‌తో టెస్టులో చివరి వికెట్ తీసిన అనంతరం సిరాజ్.. రెండు చేతులూ వెనక్కినెట్టి గట్టిగా అరుస్తూ సింహనాదం చేశాడు. దీన్ని 'సుయ్' సెలబ్రేషన్స్ అంటారు. సాకర్ స్టార్ క్రిస్టియానో రొనాల్డో ఇదే రీతిన సెలబ్రేట్ చేసుకుంటాడు. 2013లో ఓ మ్యాచ్‌లో గోల్ కొట్టినప్పుడు రొనాల్డో తొలిసారిగా ఈ విన్యాసాన్ని ప్రదర్శించాడు. సుయ్ అనేది పోర్చుగీసు పదం. దీనికి అవును అనే అర్థం. 'అవును.. నేను ప్రత్యర్థిని పడగొట్టా' అనే అర్థం వచ్చేలా ఈ విన్యాసాన్ని ఆటగాళ్లు ప్రదర్శిస్తుంటారు.సిరాజ్, ప్రసిద్ధ్‌లాంటి బౌలర్లుంటే కెప్టెన్సీ చేయడం తేలికవుతుంది. ఆఖరి రోజు మా ప్రదర్శనపై పూర్తి సంతృప్తిగా ఉన్నా. నిజానికి ఇరు జట్లు గ్రేడ్ 'ఎ' క్రికెట్ ఆడాయి. మేం గెలుస్తామన్న నమ్మకం నాలుగో రోజే కలిగింది. ఎందుకంటే ఒత్తిడి ఉన్నది వారిపైనే. కెప్టెన్ గిల్

# సెమీస్‌కు ఆరుగురు బాక్సర్లు



బ్యాంకాక్: అండర్-22 ఆసియా బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత ఆటగాళ్లు సెమీస్ చేరి ఆరు పతకాలు ఖాయం చేశారు. వీరిలో ఇద్దరు మహిళలు, నలుగురు పురుషులు ఉన్నారు. సోమవారం జరిగిన క్వార్టర్స్ బౌట్‌లో ప్రియ (60 కిలోలు), పరంజల్ యాదవ్ (70 కి)తోపాటు హర్ష్ (60 కి), నీరజ్ (75 కి), రాకీ చౌదరి (85 కి), ఇషాన్ (90o కి) గెలిచి సెమీసకు చేరుకొన్నారు.

# గ్రేటెస్ట్ విన్



నవ యువ భారత జట్టు అద్భుతం చేసింది. అసాధ్యమనుకున్న విజయాన్ని సుసాధ్యం చేసింది. దిగ్గజ ఆటగాళ్లు కోహ్లీ, రోహిత్, అశ్విన్‌లేని లోటును పూరించింది. ప్రపంచ క్రికెట్‌లో భారత్‌ను తిరుగులేని శక్తిగా నిలిపే సత్తా తమకుందని నిరూపించింది. చారిత్రక ఐదో టెస్ట విజయానికి..మాంచెస్టర్‌లో జరిగిన నాలుగో టెస్టును అమోఘ రీతిలో డ్రా చేసుకోవడం స్ఫూర్తిగా నిలిచింది. ఆ టెస్టు స్ఫూర్తితో 'ఓవల్‌'లో గెలుపు సాధించగలమన్న ధీమా గిల్ సేనలో ఏర్పడింది. అయితే ఆఖరి టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో బ్యాటర్లు తడబాటుకు లోనైనా.. పేసర్లు సిరాజ్, ప్రసిద్ధ్ తడాఖా చూపడంతో భారీ స్కోరు చేయకుండా ఇంగ్లండ్‌ను నిలువరించింది. ఇక రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటర్లు చెలరేగడంతో మనోళ్లు దాదాపు 400కు చేరువగా వచ్చారు. కానీ బ్యాటింగ్‌కు అనుకూలించిన వికెట్‌పై 374 పరుగుల లక్ష్యం ఆతిథ్య జట్టుకు సులువేననని అనిపించింది. పైగా రూట్, బ్రూక్ శతకాలతో కదం తొక్కడంతో భారత్ విజయంపై నీలినీడలు కమ్ముకున్నాయి. మన యువకుల పట్టు సడలుతుందేమోనని అనిపించింది. బ్రూక్ ఇచ్చిన క్యాచ్‌ను సిరాజ్ జారవిడవడంతో మ్యాచ్ చేజారినట్టేనని అభిమానులు డీలా పడ్డారు. కానీ టీమిండియా మాంచెస్టర్‌లో కంటే మిన్నగా పోరాడింది.ఈ ఊపులో బ్రూక్, రూట్‌ను పెవిలియన్ చేర్చి మ్యాచ్‌పై పట్టు సాధించారు. కానీ స్మిత్ క్రీజులో ఉండడంతోపాటు ఇంగ్లండ్ లోయరార్డర్ ఆటగాళ్లు కీలక సమయాల్లో బ్యాట్ ఝుళిపించే నైపుణ్యం ఉండడంతో విజయంపై సందేహాలు ఏర్పడ్డాయి. కానీ ఆఖరి రోజు హైదరాబాద్ పేసర్ సిరాజ్ విజృంభణకు ఇంగ్లండ్ కుదేలైంది. చారిత్రక విజయం మన సొంతమైంది.

# ఇలా చేస్తే ఇంగ్లాండ్‌ను 33వ సారి టీమిండియా ఓడించవచ్చు..




టీమిండియా చివరి టెస్ట్ లాస్ట్ దశకు వచ్చేసింది. ఈ మ్యాచులో ఇంగ్లండ్ జట్టు విజయానికి 35 పరుగులు అవసరం. భారత్ జట్టు సిరీస్ సమం చేయాలంటే మిగిలిన నలుగురిని ఔట్ చేయాలి. ఇలాంటి సమయంలో టీమిండియా గెలవడంతోపాటు, ఇంగ్లాండ్‌తో సిరీస్ స్కోరు సమం చేసుకునే ఛాన్స్ కూడా ఉందని నిపుణులు చెబుతున్నారు.%ఇంతకు ముందు 32 సార్లు చేసినట్లుగానే ఇంగ్లండ్‌తో చేయాలని అంటున్నారు. 33వ సారి కూడా వారిని అదే విధంగా ఓడించాలని సూచిస్తున్నారు. ముందు సెషన్‌లో గెలవడం గురించి మాట్లాడే కెప్టెన్ల ప్రకటనలను మీరు అర్థం చేసుకోవాలి. 33వ సారి ఇంగ్లండ్‌ను ఓడించడం కూడా ఇదే సూచిస్తుంది.టెస్ట్ మ్యాచ్‌లో సెషన్ చాలా ముఖ్యం. 5 రోజుల ఆటలో మొత్తం 15 సెషన్‌లు ఉంటాయి. దీని ప్రకారం టీమిండియా, ఇంగ్లండ్ మధ్య జరిగే 5 టెస్ట్ సిరీస్‌లో మొత్తం 75 సెషన్‌లు ఉంటాయి. ఓవల్ టెస్ట్‌లో 5వ రోజు ఆట ప్రారంభమైనప్పుడు, అది సిరీస్‌లోని 13వ, 73వ సెషన్‌లో ప్రారంభం అవుతుంది. సిరీస్‌లోని మొదటి 71 సెషన్‌లలో 32 సెషన్‌లను టీమ్ ఇండియా గెలుచుకుంది. ఇప్పుడు అదే శైలిలో 73వ సెషన్‌ను గెలిస్తే, అది సిరీస్‌లో 33వ సెషన్ విజయం మాత్రమే కాదు, ఓవల్ టెస్ట్‌లో విజయాన్ని సాధించవచ్చు.

# టుడే బిజినెస్

# యస్ బ్యాంక్ లోన్ మోసం కేసు.. ఈడీ ముందుకు అనిల్ అంబానీ




ఢిల్లీ: రూ.17వేల కోట్ల లోన్ మోసం కేసు విచారణ నిమిత్తం పారిశ్రామికవేత్త అనిల్ అంబానీ ఈడీ ఎదుట హాజరయ్యారు. మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో ఢిల్లీలోని ఈడీ ఆఫీస్‌కు ఆయన చేరుకున్నారు. 11.30 గంటలకు విచారణ మొదలైనట్లు తెలుస్తోంది. ప్రస్తుతం విచారణ కొనసాగుతోంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. ఈడీ అధికారులు అనిల్ లాయర్లను లోపలికి అనుమతించలేదు. లాయర్లు లేకుండానే అనిల్‌ను విచారిస్తున్నారు. మొత్తం విచారణను కెమెరాలో రికార్డు చేస్తున్నారు.ప్రివెన్షన్ ఆఫ్ మనీల్యాండరింగ్ యాక్ట్ కింద అనిల్ అంబానీ స్టేట్‌మెంట్‌ను రికార్డు చేస్తున్నారు. కాగా, లోన్ మోసం కేసుకు సంబంధించి ఈడీ ఆగస్టు 1వ తేదీన ఆయనకు సమన్లు జారీ చేసింది. విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. ఆ వెంటనే అంబానీకి లుక్ అవుట్ నోటీసులు జారీ చేసింది. ఈ కేసుతో సంబంధం ఉన్న బిశ్వాల్ ట్రేడ్ లింక్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ పార్థసారథి బిశ్వాల్‌ను సైతం అరెస్ట్ చేసింది. రూ.68.2కోట్ల విలువైన ఫేక్ గ్యారెంటీలు ఇచ్చాడన్న ఆరోపణల నేపథ్యంలో ప్రివెన్షన్ ఆఫ్ మనీ ల్యాండరింగ్ యాక్ట్ కింద బిశ్వాల్ ను అదుపులోకి తీసుకుంది.2017 నుంచి 2019 మధ్య కాలంలో రిలయన్స్ కంపెనీ యస్ బ్యాంకు నుంచి రూ.3వేల కోట్ల లోన్లు తీసుకుంది. ఈ రూ.3వేల కోట్లను అనిల్ అంబానీ దారి మళ్లించారన్న ఆరోపణలు ఉన్నాయి. లోన్ ఇవ్వడానికి ముందు బ్యాంకు ప్రమోటర్లకు పెద్ద మొత్తం నిధులు అందినట్లు ఈడీ కనుగొంది. రూ.3వేల కోట్ల లోన్ నిధుల మళ్లింపును క్విడ్ ప్రోకోగా తేల్చింది. అంతేకాదు.. రిలయన్స్ కమ్యూనికేషన్స్ లిమిటెడ్ మరో రూ.14వేల కోట్ల లోన్ మోసాలకు పాల్పడినట్లు ఈడీ అధికారులు తేల్చారు. మొత్తం రూ.17వేల కోట్లకు సంబంధించి ప్రస్తుతం విచారణ జరుగుతోంది. వివిధ బ్యాంకుల నుంచి రిలయన్స్ కంపెనీ తీసుకున్న లోన్ల గురించీ ఈడీ ఆరా తీస్తోంది. ఇప్పటికే పలు బ్యాంకులకు లోన్ల వివరాలు చెప్పాలంటూ లేఖలు రాసింది.

# భారత్‌పై మరింతగా పన్నులు పెంచుతా.. డొనాల్డ్ ట్రంప్ మరోసారి బెదిరింపు..




అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి భారత్‌పై తన ఆగ్రహాన్ని వెల్లడించారు. రష్యా నుంచి భారత్ చమురును కొనుగోలు చేస్తుండడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ విషయమై అమెరికా హెచ్చరించినా భారత్ వెనక్కి తగ్గపోవడంతో ఆయన ఆగ్రహం మరింత పెరుగుతోంది . ఈ నేపథ్యంలో మరోసారి భారత్‌పై అక్కసు వెళ్లగక్కారు. భారత్‌పై 25 శాతం పన్నులు పెంచుతున్నట్టు ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆ పన్నులతోనే ఆగనని మున్ముందు మరింతగా పెంచుతానని ట్రంప్ తాజాగా ప్రకటించారు 'రష్యా యుద్ధంలో ఎంత మంది ఉక్రెయిన్ పౌరులు చనిపోతున్నారో భారత్ పట్టించుకోవడం లేదు. రష్యా నుంచి ఆయిల్ కొంటూ ఆ దేశానికి నిధులు సమకూర్చడం ఆపడం లేదు. కాబట్టి భారత్‌పై మున్ముందు మరింతగా సుంకాలు పెంచుతాను' అని ట్రూత్ సామాజిక మాధ్యమం ద్వారా ట్రంప్ సోమవారం హెచ్చరించారు. అలాగే వలస వ్యవహారాల్లోనూ అమెరికాను భారత్ మోసం చేస్తోందని వైట్‌హౌస్ ఉన్నతాధికారి స్టీఫెన్ మిల్లర్ వ్యవహరించారు.కాగా, రష్యా నుంచి చమురు కొనే విషయంలో అమెరికా అభ్యంతరాలను భారత్ గట్టిగా తిప్పికొట్టింది. దేశీయ ఇంధన అవసరాలను తీర్చుకోవడానికే రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేస్తోందని సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. అమెరికా ఇప్పటికీ రష్యా నుంచి యురేనియం హెక్సాఫ్లోరైడ్, విద్యుత్ వాహనాలు, ఎరువుల తయారీకి అవసరమైన పలేడియంను దిగుమతి చేసుకోవడాన్ని ప్రశ్నించింది

# ట్రంప్ బెదిరింపులు.. మళ్లీ నష్టాల బాట పట్టిన స్టాక్ మార్కెట్లు..




సోమవారం లాభాలను ఆర్జించిన దేశీయ సూచీలు మంగళవారం మళ్లీ నష్టాల బాట పట్టాయి. భారత్‌పై మరింతగా సుంకాలను పెంచుతానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో మదుపర్లు అమ్మకాలకు దిగారు. అంతర్జాతీయంగా సానుకూల సంకేతాలు ఉన్నప్పటికీ ట్రంప్ బెదిరింపుల నేపథ్యంలో సూచీలు నష్టాల్లో కదలాడుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం సెన్సెక్స్, నిఫ్టీ నష్టాల బాటలో ఉన్నాయి సోమవారం ముగింపు (81, 018)తో పోల్చుకుంటే మంగళవారం ఉదయం స్వల్ప నష్టాలతో మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత మరింతగా నష్టాల్లోకి జారుకుంది. ప్రస్తుతం ఉదయం 10:40 గంటల సమయంలో సెన్సెక్స్ 410 పాయింట్ల నష్టంతో 80, 608 వద్ద కొనసాగుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే సాగుతోంది. ప్రస్తుతానికి 115 పాయింట్ల నష్టంతో 24, 607 వద్ద కొనసాగుతోంది. సెన్సెక్స్‌లో నవుమా హెల్త్, కేన్స్ టెక్నాలజీస్, మాజగాన్ డాక్, ఏపీఎల్ అపోలో, ఇండస్ ఇండ్ బ్యాంక్ షేర్లు లాభాల్లో ఉన్నాయి. హిందుస్థాన్ పెట్రో, మనప్పురం ఫైనాన్స్, ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్, ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్, పీబీ ఫిన్‌టెక్ షేర్లు నష్టాల బాటలో కొనసాగుతున్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 280 పాయింట్ల నష్టంతో ఉంది. బ్యాంక్ నిఫ్టీ 205 పాయింట్ల నష్టంతో కొనసాగుతోంది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 87.82గా ఉంది.

# మళ్లీ పెరిగిన బంగారం ధర.. ఈ రోజు బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయంటే..





బంగారం ధర మళ్లీ లక్ష రూపాయలను దాటేసి ఆల్‌టైమ్ గరిష్టానికి చేరువ అవుతోంది. భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో పెట్టుబడిదారులు సురక్షిత ఆస్తుల వైపు మొగ్గు చూపుతుండడం బంగారం ధరల పెరుగుదలకు కారణంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ రోజు (ఆగస్టు 5న) ఉదయం 6.30 గంటల సమయానికి 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. రూ. 1, 01, 410కి చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. రూ. 92, 960కి చేరింది. నిన్నటితో పోల్చుకుంటే బంగారం ధర స్వల్పంగా పెరిగింది.ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ. 1, 01, 560కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 93, 110కి చేరుకుంది. ఇక హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1, 01, 410కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 92, 960కి చేరింది. వెండి ధరలు నిన్నటితో పోల్చుకుంటే స్థిరంగా ఉన్నాయి. ఈ క్రమంలో దేశంలోని ప్రధాన నగరాల్లో ఉన్న బంగారం, వెండి రేట్లను ఇప్పుడు తెలుసుకుందాం.

# జీ ఎస్ టీ ఎగవేతలు ఐదేళ్లలో రూ 7 లక్షల 08 కోట్లు




న్యూఢిల్లీ: జీఎసటీ కాలంలోనూ పన్ను ఎగవేతలు య? దేచ్ఛగా సాగుతున్నాయి. గత ఐదేళ్లలో (2020–25) 91,370 కేసుల్లో రూ.7.08 లక్షల కోట్ల జీఎసటీ ఎగవేతలను కేంద్ర ప్రభుత్వ నిర్వహణలోని క్షేత్ర స్థాయి జీఎసటీ అధికారులు గుర్తించారు. కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి సోమవారం లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో ఈ విషయం వెల్లడించారు. గత ఐదేళ్లలో వ్యాపారులు, వ్యాపా ర సంస్థలు, కంపెనీలు ఎగవేసిన రూ.7.08 లక్షల కోట్ల జీఎస్‌టీ కేసుల్లో ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ (ఐటీసీ) వాటానే రూ.2.79 లక్షల కోట్ల వరకు ఉందని మంత్రి చెప్పారు. ఐతే గత ఐదేళ్లలో స్వచ్ఛంద డిపాజిట్ పథకం ద్వారా రూ.1.29 లక్షల కోట్ల జీఎసటీ ఎగవేతల సొమ్మును అధికారులు రాబట్టగలిగారు.2024–25 ఆర్థిక సంవత్సరంలో 33,056 కేసుల్లో రూ.2.23 లక్షల కోట్ల జీఎసటీ ఎగవేతలను అధికారులు గుర్తించారు. ఇందులో 15,283 కేసులు ఐటీసీ ఎగవేతలకు సంబంధించినవి ఉన్నాయి. ఈ ఎగవేతల ద్వారా కేంద్ర ప్రభుత్వ ఖజానాకు రూ.58,772 కోట్ల వరకు గండి పడింది. 2023–24 ఆర్థిక సంవత్సరంలోనూ రూ.2.30 లక్షల జీఎసటీ ఎగవేతలకు సంబంధించిన కేసులను సీజీఎసటీ అధికారులు గుర్తించారు. ఇందులో ఐటీసీ స్వాహా రూ.36,374 కోట్ల వరకు ఉంది. 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ.1.32 లక్షల కోట్లు, 2021–22 ఆర్థిక సంవత్సరంలో రూ.73,238 కోట్లు, 2020–21 ఆర్థిక సంవత్సరంలో రూ.49,384 కోట్ల జీఎసటీ ఎగవేత కేసులను అధికారులు గుర్తించారు.

# ఐదో అతిపెద్ద విమానయాన మార్కెట్‌గా భారత్



న్యూఢిల్లీ: భారత్ ప్రపంచంలో ఐదో అతి పెద్ద విమానయాన సేవల మార్కెట్‌గా అవతరించిందని ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ (ఐఏటీఏ) వెల్లడించింది. గత ఏడాది భారత్‌లో 21.1 కోట్ల మంది (జాతీయ, అంతర్జాతీయ) విమాన ప్రయాణం చేశారని, 2023తో పోలిస్తే విమాన ప్రయాణికుల సంఖ్య 11.1 శాతం పెరిగిందని తాజా నివేదికలో వెల్లడించింది. అలాగే, ముంబై–ఢిల్లీ అత్యంత రద్దీ విమానాశ్రయాల జంటల్లో ఒకటని పేర్కొం ది. ప్రపంచవ్యాప్తంగా 350 ఎయిర్‌లైన్స్‌కు ప్రాతినిథ్యం వహిస్తున్న ఐఏటీఏ రిపోర్టులోని మరిన్ని విషయాలు.ప్రపంచంలోని అత్యంత రద్దీ విమానాశ్రయాల జంటలో ముంబై–ఢిల్లీ 7వ స్థానంలో ఉన్నాయి.

# రూపాయికి సుంకాల పోటు



ముంబై: గడిచిన కొన్ని రోజుల్లో భారత కరెన్సీ విలువ తీవ్ర ఒడుదుడుకులకు లోనవుతోంది. ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌తో రూపాయి మారకం విలువ సోమవారం మరో 48 పైసలు పతనమై రూ.87.66 వద్ద ముగిసింది. ట్రంప్ సుంకాల పోటు, మన ఈక్విటీ మార్కెట్ నుంచి విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల (ఎఫ్ఐఐ) పెట్టుబడుల ఉపసంహరణ, దిగుమతిదారుల నుంచి డాలర్లకు డిమాండ్ పెరగడం ఇందుకు కారణమని ఫారెక్స్ వర్గాలు తెలిపాయి. గతవారంలోనూ రూపాయి మారకం విలువ 1.2 శాతం పతనమైంది. 2022 డిసెంబరు తర్వాత మన కరెన్సీకిదే అతిపెద్ద వారం రోజుల క్షీణత. అమెరికా–భారత్ మధ్య వాణిజ్య ఒప్పందంపై అనిశ్చితితోపాటు విదేశీ పెట్టుబడులు తరలిపోతుండటంతో రాబోయే కాలంలో కూడా రూపాయి బలహీనంగానే ఉండవచ్చని మిరే అసెట్ షేర్‌ఖాన్ కమోడిటీస్, కరెన్సీస్ రీసెర్చ్ అనలిస్ట్ అనూజ్ చౌదరి అభిప్రాయపడ్డారు. రాబోయే సెషన్లలో డాలర్–రూపీ మారకం రేటు రూ.88.50కి చేరుకోవచ్చని ఐసీఐసీఐ బ్యాంక్ తాజా నివేదిక అంచనా వేసింది.

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006